https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో

చాటింపు

తెలంగాణ దిన పత్రిక



హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 27 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ ఆదివారం,అక్టోబర్,25, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

షర్మిలకు జగన్ లేఖ.. మేనకోడలి పెళ్లికి

బెంగళూరు ఇల్లు వద్దని స్పష్టీకరణ

ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ లోటస్ పాండ్‌ను పరిశీలించాలని సూచన

హైదరాబాద్,అక్టోబర్,24: వైసీపీ అధినేత జగన్ తన సోదరి షర్మిలకు రాసిన ఓ లేఖను ఆ పార్టీ తాజాగా విడుదల చేసింది. షర్మిల కుమార్తె అంజలి వివాహానికి సంబంధించి అక్టోబర్ 9న రాసినఈ లేఖలో, పెళ్లి వేదిక విషయంలో జగన్ తన అభ్యంతరాలను, కారణాలను స్పష్టంగా వివరించారు. మేనకోడలు అంజలి వివాహం జరగనుండటం పట్ల జగన్ తొలుత సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ వేడుకను బెంగళూరులోని తన నివాసంలో నిర్వహించాలని షర్మిల కుటుంబం భావిస్తున్నట్లు తెలిసిందని, కానీ అక్కడ ఈ కార్యక్రమం నిర్వహిస్తే తీవ్రమైన భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. భద్రత, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన అంశాలను విస్మరించవద్దని షర్మిలను కోరారు. బెంగళూరులోని ఇల్లు తన కుటుంబ నివాసమని, అక్కడ తాము సురక్షితంగా ఉండాల్సిన అవసరం ఉందని జగన్ నొక్కిచెప్పారు. తన సొంత పిల్లల వివాహం విషయంలో కూడా భద్రత దృష్ట్యా తాను ఇలాంటి నిర్ణయమే తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ విషయంలో తన ఇబ్బందులను ఇప్పటికే కొందరి ద్వారా తెలియజేసినా, తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం



బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తన పరిస్థితిని అర్థం చేసుకొని, దయచేసి మరో వేదికను ఎంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అవసరమైతే హైదరాబాద్‌లోని లోటస్ పాండ్‌లోనైనా వివాహం జరుపుకోవచ్చని సూచించారు. అంజలి వివాహ ఏర్పాట్లకు సంబంధించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో, జగన్ వైఖరిని స్పష్టం చేసేందుకే వైసీపీ ఈ లేఖను విడుదల చేసినట్లు తెలుస్తోంది.

బషీర్‌బాగ్‌లో రాముడి విగ్రహం తొలగింపు..

బందోబస్తు మధ్య తరలింపు

- విజయదశమి నాడు హిందూ సంఘాలు ఏర్పాటు చేసిన విగ్రహం
- అనుమతులు లేవంటూ ఎంబీటీ నేతల అభ్యంతరం

హైదరాబాద్,అక్టోబర్,24: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన శ్రీరాముడి విగ్రహాన్ని శనివారం అధికారులు తొలగించారు. విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రతిష్ఠించిన ఈ విగ్రహం చుట్టూ పేరు మార్పు వివాదం నెలకొనడంతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. విశ్వహి ందూ పరిషత్‌తో అనుబంధం ఉన్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని కూడలిలోని అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, బషీర్‌బాగ్‌ను ఇకపై“శ్రీరామ్ చౌక్”గా వ్యవహరించాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ పరిణామం నగరంలో రాజకీయ వివాదానికి దారితీసింది. విగ్రహ ఏర్పాటు, పేరు మార్పు ప్రతిపాదనపై మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ లేదా నగర పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ఆ పార్టీ అధికార ప్రతినిధి అంజద్ ఉల్లా ఖాన్ ప్రశ్నిం చారు.
కూడలి పేరు మార్పుపై ప్రకటనలు వస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు. విగ్రహ ఏర్పాటుకు



సంబంధించి ఏవైనా అధికారిక ప్రతిపాదనలు ఉన్నాయా అని ఆయన స్పష్టత కోరారు. అభ్యంతరాలు వ్యక్తమై వివాదం తీవ్రతరం కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. శనివారం ఉదయం
ఆలయ సిబ్బంది క్రేన్ సహాయంతో శ్రీరాముడి విగ్రహాన్ని జాగ్రత్తగా తొలగించి లారీలోకి తరలించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని పోలీసులు దగ్గరుండి పర్యవేక్షించారు. సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ముగిసిన కొద్ది రోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

హైదరాబాద్‌కు నీటి గండం..

పొదుపుగా వాడాలంటూ లౌడ్‌స్పీకర్లతో ప్రచారం

- ఎల్‌నినో ప్రభావంతో హైదరాబాద్‌లో తీవ్ర నీటి కొరత- నీటి వృధాను అరికట్టాలని లౌడ్‌స్పీకర్లతో ప్రచారం- రాష్ట్రంలో 27 శాతం తక్కువ వర్షపాతం నమోదు- తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యతనిస్తున్నప్రభుత్వం- నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలకు అధికారుల ఆదేశం

హైదరాబాద్,అక్టోబర్,24: హైదరాబాద్ నగరాన్ని తీవ్ర నీటి సంక్షోభం ఆందోళనకు గురిచేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, రిజర్వాయర్లలో నీటిమట్టాలు గణనీయంగా పడిపో వడం ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి సరఫరాపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండటంతో, నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరం లోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాయి. మణికొండలోని పంచవటి సాయి లక్ష్మి కాలనీలో ఒక వ్యక్తి సైకిల్‌పై లౌడ్‌స్పీకర్‌తో అవగాహన కల్పిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కార్లు, సెల్లార్లు, రోడ్లు, టెర్రస్‌లు శుభ్రం చేసేందుకు కుళాయి లేదా బోర్ నీటిని వృథా చేయవద్దని ఆయన నినదిస్తున్న తీరు, నగరంలో నెలకొన్న నీటి ఎద్దడి తీవ్రతను కళ్లకు కడుతోంది. రాష్ట్రంలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అంగీకరించింది. ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోయాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు 20 శాతం కంటే తక్కువకు చేరుకున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తెలిపారు. ప్రస్తుత తరుణంలో సాగునీటి కంటే ప్రజలు, పశువులు, ఇతర జీవరాశుల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.



ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాల్లో 30 నుంచి 40 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని, 2027 జూలై వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నీటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

నోయిడాలో అగ్నిప్రమాదం..

ఐదు దుకాణాల్లో చెలరేగిన మంటలు, ఒకరి మృతి



న్యూఢిల్లీ,అక్టోబర్,24: దేశ రాజధాని ఢిల్లీ సమీపంలోని నోయిడాలో శనివారం అగ్నిప్రమాదం చోటుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నోయిడాలోని రాయ్‌పూర్‌లోని 126వ సెక్టార్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాల్లో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా.. ఘటనాస్థలంలో ఓ వ్యక్తి నృహ కోల్పోయి కనిపించడంతో.. అగ్నిమాపక సిబ్బంది బాధితుడిని సమీప ఆసుపత్రికి తరలించారు.అప్పటికే బాధితుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా.. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు..

26న సుల్తాన్‌పూర్ కోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ,అక్టోబర్,24: లోక్‌సభాపక్ష నేత, కాంగ్రెస్ లీడర్ రాహుల్ గాంధీ కి సంబంధించిన పరువు దావా కేసులో ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ ప్రజాప్రతినిధుల కోర్టులో వాదనలు ముగిశాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 26న కీలక తీర్పు వెలువడనుంది. దీంతో రాహుల్ గాంధీ స్వయంగా సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరయ్యే అవకాశం ఉందని వార్తలు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నారు.కాగా, 2018లో కర్ణాటక ఎన్నికల ప్రచార సమయంలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ను ఉ ద్దేశించి రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. దీంతో బీజేపీ నేత విజయ్ మిశ్రా 2018 ఆగస్టు 4న సుల్తాన్‌పూర్ కోర్టులో రాహుల్ గాంధీపై క్రిమినల్ పరువు నష్టం దావా పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో సుల్తాన్‌పూర్ ప్రజాప్రతినిధుల కోర్టు రాహుల్ గాంధీకి నోటీసులు జారీ చేయగా, ఆయన ఫిబ్రవరి 2024లో కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. జులై 2024లో కోర్టులో తన వాంగ్మూలాన్ని నమోదు చేస్తూ, ఈ ఆరోపణలను ఖండించారు. తాజాగావిచారణ ప్రక్రియ అంతా పూర్తవడంతో అడిషనల్ సివిల్ జడ్జి శుభమ్ వర్మ తీర్పును అక్టోబర్ 26కి వాయిదా వేశారు. తీర్పు సమయం లో రాహుల్ గాంధీ కోర్టు ముందు ప్రత్యక్షంగా హాజరుకావాల్సి ఉ



న్నందున,సుల్తాన్‌పూర్‌లో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ తీర్పుపై దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

2028 నాటికి భారతీయ బ్రాండ్‌తో మొబైల్ ఫోన్లు

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ రంగంలో భారత్ మరింత స్వయం సమృద్ధి సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక లక్ష్యాన్ని నిర్దేశించుకుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2028 అక్టోబర్ 23 నాటికి భారతీయులే రూపొందించి, భారత్‌లోనే తయారు చేసి, భారతీయ బ్రాండ్‌తో విక్రయించే మొబైల్ ఫోన్లను అందుబాటులోకి తీసుకురావా లని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.
అక్టోబర్ 23న ఢిల్లీలో ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన వరల్డ్ సమ్మిట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్ల మార్కెట్‌లో స్వయం సమృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. భారత్‌లో మొబైల్ ఫోన్ల తయారీ సామర్థ్యం పెరుగుతున్నప్పటికీ, సొంత రూపకల్పన, సాంకేతిక పరిజ్ఞానం, బ్రాండ్ అభివృద్ధి వంటి అంశాల్లోనూ దేశం మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆపిల్, శామ్‌సంగ్ వంటి ప్రముఖ సంస్థలకు పోటీగా నిలవగల భారతీయ మొబైల్ బ్రాండ్‌ను అభివృద్ధి చేయాలన్నది ఈ లక్ష్యం వెనుక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ రూపకల్పన అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని ఆయన వివరించారు.

సీఎం విజయ్ కీలక నిర్ణయం.. ప్రశంసించిన కేంద్రం!

చెన్నై,**అక్టోబర్,24:** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వానికి కేంద్రం నుంచి ప్రశంసలు లభించాయి. రాష్ట్రంలోని విమా నాశ్రయాల్లో విమాన ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తగ్గిస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతించారు. విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలంటే కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో విమానయాన సంస్థలకు ఈ నిర్ణయం కొంత ఊరటని వ్వనుంది. తమిళ నాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం.. చెన్నై విమానాశ్రయంలో విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై వ్యాట్‌ను ప్రస్తుతం ఉన్న 29 శాతం నుంచి 16 శాతానికి తగ్గించారు. రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో ఈ పన్నును 29 శాతం నుంచి కేవలం ఒక శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయం నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. 2027 అక్టోబర్ 31 వరకు ఈ పన్ను రాయితీ కొనసాగుతుంది. రాష్ట్రంలోని నగరాల మధ్య విమాన సర్వీసులను పెంచడం, విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులను తగ్గించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యాలు.కేంద్ర మంత్రిరామ్మోహన్ నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిం చారు. విమాన ఇంధనంపై వ్యాట్ తగ్గింపు విమానయాన రంగానికి స్వాగతించదగిన చర్య అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమం త్రి విజయ్‌కు ధన్యవాదాలు తెలిపారు. విమాన ప్రయాణాన్ని మరింత చౌకగా మా ర్చేందుకు కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని, ప్రయాణికుల ప్రయోజనాలే ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని అన్నారు.

అల్లూరి జిల్లాలో ఘోర ప్రమాదం..

ఐదుగురు స్పాట్ డెడ్



అమరావతి,అక్టోబర్,24: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అనంతగిరి మండలం పినకోట గ్రామం వద్ద రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా అమర్చిన జిలెటిన్ స్టిక్స్ అకస్మాత్తుగా పేలి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. రహదారి పనుల్లో భాగంగా కొండను తొలిచేందుకు కాంట్రాక్టర్లు, నిర్వాహకులు జిలెటిన్ స్టిక్స్ అమర్చగా, ఈ పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది.ఈ విషాద ఘటనలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, డ్రైవర్‌తో పాటు ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను విశాఖపట్నంకు చెందిన టీచర్ సునీత, దేవరాపల్లికి చెందిన కార్మికుడు మణి, చీడికాడకు చెందిన నారాయణరావు, కడపకు చెందిన పవన్ కుమార్‌తో పాటు ఓ వాహన డ్రైవర్‌గా గుర్తించారు. టీచర్ సునీత రోజూలాగే పాఠశాలకు వెళ్తున్న సమయంలో ఊహించని విధంగా ఈ పేలుడు జరగడంతో ఆమె ప్రమాదానికి గురై మరణించారు. పేలుడు ధాటికి అక్కడే ఉన్న రెండు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.
ప్రమాద తీవ్రతకు పరిసర ప్రాంతాలు భయాందోళనకు గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువత కలలకు పోలీస్ శాఖ చేయూత

-ఉచిత శిక్షణతో ఉద్యోగ సాధనకు బాటలు... -నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్... -ఎస్సై,కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ... -మెరిట్ ఆధారంగా 130 మంది అభ్యర్థుల ఎంపిక... -ఉచిత వసతి,నాణ్యమైన బోధన,స్టడీ మెటీరియల్‌తో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్ శిక్షణ...

నారాయణపేట,(డీకే చాటింపు): జిల్లాలో పేద, ప్రతిభావంతులైన యువత పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యానికి ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ తరగతులను ఎస్పీ ప్రారంభించారు.పోలీస్ ఉద్యోగాల కోసం నిర్వహించిన అర్హత పరీక్షకు మొత్తం 413 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారిలో ప్రతిభ ఆధారంగా 130 మంది మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా నాణ్యమైన బోధన, అవసరమైన స్టడీ మెటీరియల్‌తో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు ఫిజికల్ ఫిట్‌నెస్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎంతోమంది యువతకు పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే పట్టుదల, ప్రతిభ ఉన్నప్పటికీ ప్రైవేట్ కోచింగ్ తీసుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.అలాంటి యువతకు సమాన అవకాశాలు కల్పించి,వారి ప్రతిభను వెలికితీసి,ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలవాలనే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.యువతకు సరైన మార్గదర్శకత్వం,నాణ్యమైన శిక్షణ అందిస్తే వారు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఎస్పీ పేర్కొన్నారు.అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉద్యోగ సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు.తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ,ప్రతిరోజూ నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకోవాలని, మాక్ టెస్టుల ద్వారా తమ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలని తెలిపారు.రాత పరీక్షతో పాటు శారీరక దారుఢ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని,ఫిజికల్ ఈవెంట్లలో అర్హత సాధించేందుకు నిరంతరం సాధన చేయాలని సూచించారు.పోలీస్ శాఖ కల్పిస్తున్న ఉచిత వసతి, బోధన, స్టడీ మెటీరియల్, ఫిట్‌నెస్ శిక్షణ వంటి సదుపాయాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. శిక్షణలో క్రమశిక్షణ, సమయపాలన అత్యంత ముఖ్యమని ఎస్పీ స్పష్టం చేశారు. శిక్షణ



పట్ల నిర్లక్ష్యం, క్రమశిక్షణా ఉల్లంఘనలను సహించబోమని, నిబంధనలు పాటించని అభ్యర్థులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు శిక్షణ నుంచి తొలగించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రతి అభ్యర్థి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ,పూర్తి నిబద్ధతతో శిక్షణ పొందాలని సూచించారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పోలీస్ శాఖలో చేరాలనుకునే యువతకు ఈ శిక్షణ కార్యక్రమం ఒక మంచి అవకాశమని ఎస్పీ తెలిపారు.కష్టపడే తత్వం, పట్టుదల,క్రమశిక్షణ,నిరంతర సాధనతో లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులందరూ తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రతిభావంతులైన యువతకు ప్రోత్సాహం అందించడం, వారికి సరైన దిశానిర్దేశం చేయడం,పోలీస్ నియామకాల్లో విజయవంతమయ్యేలా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎస్పీ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,వారి ఉద్యోగ సాధనకు జిల్లా పోలీస్ శాఖ తనవంతు సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్,నల్లపు లింగయ్య,కాజల్,సీఐలు శివ శంకర్,రామ్ లాల్,భగవంత్ రెడ్డి,సైదులు,ఎస్సైలు వెంకటేశ్వర్లు,సతీష్ రెడ్డి, నరేష్,ఎస్‌బీ ఎస్ఐ భాగ్య రెడ్డి,అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు

జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటి

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ఇలా త్రిపాఠి

నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 24(డీకే చాటింపు): జిల్లాలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం లోటు ఏర్పడి కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా వ్యవహరించనుండగా, జిల్లా వ్యవసాయ అధికారిని మెంబర్ కన్వీనర్‌గా, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, నీటిపారుదల శాఖ జిల్లా అధికారి, మిషన్ భగీరథ సూపరింటెండింగ్ ఇంజినీర్, ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కమిటీ సభ్యులుగా ఉన్నారు.కరువు పరిస్థితులను నిరంత రం పర్యవేక్షించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొం దించడం, కరువు నివారణ ప్రణాళిక అమలు తీరును నిశితంగా పరిశీలించ డం తదితర బాధ్యత లను ఈ కమిటీ నిర్వ ర్తిస్తుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. వర్షపాతం లోటు, భూగర్భ జలాల స్థితి గతులు, రిజర్వాయర్ల లో నీటి నిల్వలను ప్రతి వారం సమీక్షించడం, ప్రభావిత గ్రామాలను సందర్శించి పరిస్థితు లను అంచనా వేసి కార్యాచరణ ప్రణాళిక



రూపొందించడం, సంబంధిత శాఖల ద్వారా కరువు నివా రణ చర్యల అమలును పర్యవేక్షించడం,పంటల వైవిధ్యీకరణ, తాగునీటి సరఫరా, పశువులకు దాణా, నిరంతర విద్యుత్ సరఫరావంటి అంశాల పై జిల్లా స్థాయి కమిటీ ప్రత్యేక దృష్టి సారిస్తుం దని అన్నారు.కరువు ప్రభావం నెలకొనేందుకు అవకాశం ఉన్న మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వ హించి తక్షణ నివారణ చర్యలు చేపట్టడం, వాస్తవ పరిస్థితులపై రోజువారీ నివేదికలను సమర్పిస్తుందని, తద్వారా ప్రభుత్వానికి అవసరమైన సమాచారాన్ని అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు

12వ రోజుకు చేరిన ఉద్యోగుల సమ్మె

650 పోస్ట్ పోస్ట్ కార్డులతో గవర్నర్ కు సమస్యలపై విన్నపం



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 24 (డీకే చాటింపు):తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె నేటికి 12 రోజులకు చేరింది. దా దాదావు 17,000 మంది సమ్మెలో పాల్గొంటుండగా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం శోచనీయమనీ ఉద్యోగుల సమన్యలు పట్టవా అని వాపోయారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో గవర్నర్ గారికి ఈరోజు పోస్ట్ కార్డులు రాష్ట్రవ్యాప్తంగా పంపించారు. ఇందులో భాగంగా నిజాంబాద్ జిల్లాలో స్ట్రైక్ లో ఉన్న 650 మంది ఉద్యోగులు తమ సమస్యలు వివరిస్తూ పోస్ట్ కార్డులను తెలంగాణ రాష్ట్ర గవర్నర్కు పంపించారు. సమాన పనికి సమాన వేతనం మహిళలకు ప్రసూతి సెలవులు ఉద్యోగ భద్రత హెల్త్ కార్డులు ఇవ్వాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా ఎదుగుబోదుగులేని, చాలీచాలని వేతనాలతో కుటుం బాలను నెట్టుకు వస్తు న్నామనీ , కరోనా సమయంలో ప్రాణా లకు తెగించి విధులు నిర్వహించామని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.



వైద్యరోగ శాఖ మంత్రి ముఖ్య మంత్రి చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకులు సందీప్ ,మురళి షాదుల్లా ,పుష్ప ,విశాల సౌజన్య ,గంగాధర్ తదితరులు కోరారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగు ల

సమ్మెతో అట కెక్కిన టీకాల వైద్యం

పి హెచ్ సి యూపీహెచ్సీ లలో నిండుకున్న వ్యాక్సిన్

నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో పనిచే స్తున్న ఉద్యోగులు గత 12 రోజులుగా సమ్మెతో పీహెచ్సీ యూపీఎస్సీ లలో శనివారం, బుధవారం ఇవ్వాల్సిన టీకాలు వ్యాక్సిన్ కొరత ఏర్పడింది. ముఖ్యంగా ఏఎన్ఎంలు ఫార్మసి స్టులు వ్యాక్సిన్ స్టాకు తదితరాలు చూసు కుంటారు. వీరితోపాటు సంబంధిత సూపర్వై జర్ మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. ఇదిలా ఉండగా గత 12 రోజులుగా ఏఎన్ఎంలు ఫార్మసిస్టులు స్ట్రైక్ లో ఉండడంతో వ్యాక్సిన్ తెచ్చేవారు కరువ య్యారు. దీంతో పిల్లలు బాలింతలు గర్భిణీ స్త్రీలు వ్యాక్సిన్ దొరకక అనేక సమస్యలు ఎదుర్కొంటూ ఆందోళన చెందు తున్నారు.సమయానికి వ్యాక్సిన్ చేయకుంటే ఏమవుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తూ బోధన్ కు చెందిన దేవిక తన 45 రోజుల పాపను బోధన్ ప్రభు త్వాసుపత్రికి తీసు కెళ్లగా సిబ్బంది స్ట్రైక్ లో ఉన్నారు వ్యాక్సిన్ లేదు వెళ్లిపొమ్మని పంపించేశారని వాపోయారు. ఒకవైపు రెగ్యులర్ ఏఎన్ఎంలు స్టాఫ్ నర్సులు సూప ర్వైజర్లు పర్యవేక్షణలో ఇమినేషన్ చేస్తున్నా మని జిల్లా అధికారులు చెబుతున్నప్పటికీ, వ్యాక్సిన్ స్టాక్ లేకపోవడంపై అదే విధంగా క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదు. ముఖ్యంగా వ్యాక్సిన్ కు సంబం ధించి ఆర్ వి వి ,ఐ పి వి ,ఓ పివి లు నిండు కున్నాయి. ఆసుపత్రు లకు వచ్చిన తల్లులు పిల్లలకు వ్యాక్సిన్ చేయడంలో సిబ్బంది చేతులెత్తేశారు. నగరాలలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ప్రధానంగా ఈ సమస్య మరింత జటిలంగా ఉంది. అర్బన్ లో ఈరోజు వ్యాక్సిన్ లేక చాలా ఇక్కట్లు ఎదుర్కొ న్నారు. ప్రతి సెంటర్లో ఇద్దరు సూపర్వైజర్లు సిహెచ్వోలు ఉన్నప్పటికీ యాక్షన్ కొరతపై దృష్టి సారించలేకపోవడం శోచనీయం.ఇదేమిటని ప్రశ్నిస్తే ఇబ్బంది

స్ట్రైక్ లో ఉన్నారు మాకు చేతనేనంత వరకే చేయగలమని అన్నారు. ఇమినైజేషన్ పర్యవేక్షించాల్సిన మెడికల్ ఆఫీసర్లు ఆసుపత్రిలో అందుబాటులో ఉండాల్సింది కాగా జిల్లా కార్యాలయంలో సమావేశం ఉందని ఉదయం వెళ్లినవారు మధ్యాహ్నం మూడు గంటల వరకు కూడా ఆసుపత్రికి రాలేదు. ఇదిలా ఉండ గా గౌతమ్ నగర్ లోని ఆస్పత్రిలో వ్యాక్సిన్ గురించి అడగగా ఈరోజు వచ్చిన 33 మందిలో 8 మందికి వ్యాక్సిన్ ఇవ్వగలి గామని స్టాక్ లేకపో వడంతో ఇవ్వలే కపోయామని సూప ర్వైజర్ పుష్ప తెలిపారు. వ్యాక్సిన్ స్టాక్ గురించి వివరాలు తెలుసుకోవడానికి డి ఐ ఓ , డిఎంహెచ్ఓ గారి వివరణకై ఫోన్లో సంప్ర దించగా అందుబా టులోకి రాలేదు.



జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల

సాకారం చేస్తాం: మంత్రి పొంగులేటి

డీకే చాటింపు ప్రతినిధి, (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిన తర్వాత కూడా గతంలో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8వ తేదీన రవీంద్ర భారతిలో కార్యక్రమాన్ని నిర్వహించి భూమిని సొసైటీకి అప్పగించడం జరిగిందన్నారు.అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రిగారు వెల్లడించారు. జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. గతంలో ఎదురైన



న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా, అందరికీ ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు అండగా

పీఎం రాహత్ పథకం: సీఎస్ సంజయ్ జాజు



డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్):రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందించే పీఎం రాహత్ పథకం లో రాష్ట్రంలోని అన్ని నెట్ వర్క్ హాస్పిటల్స్ ను నమోదుచేయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కోరారు. ప్రధాన మంత్రి రోడ్డు ప్రమాద బాధితులకు ఆసుపత్రిలో మెరుగైన చికిత్సా పథకం (పీ.ఎం రాహత్) అమలుపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు, ట్రాన్స్పోర్ట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రవాణా శాఖ కమీషనర్ ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, ఆరోగ్య శ్రీ సి.ఈ.ఓ జెండగి హనుమంతు లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.సి.ఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను తక్షణమే గోల్డ్ అవర్ లో సమీపంలోని ఆసుపత్రిలో చేర్చితే వైద్య చికిత్సలకు పీ.ఎం రాహత్ పథకం కింద లక్షన్నర రూపాయ విలువైన చికిత్సలు అందించడం జరుగుతుందని అన్నారు. అయితే, ఈ పీ.ఎం రాహత్ పథకంలో రాష్ట్రంలోని హాస్పిటల్స్ నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ పథకంలో ఒక వెయ్యికి పైగా హాస్పిటల్స్ నమోదు కాగా, ఈ పీ.ఎం రాహత్ స్కీమ్ లో కేవలం 469 ఆసుపత్రులు మాత్రమే ఎన్రోల్ అయ్యాయని తెలిపారు. మిగిలిన ఆసుపత్రులన్నింటినీ ఈ పీ.ఎం రాహత్ పథకంలో నమోదు అయ్యేవిధంగా తగు చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సి.ఎస్ ఆదేశించారు. ఈ పథకం క్రింద ప్రతీ సంవత్సరం కనీసం ఒక వంద కోట్లరూపాయలు చికిత్సలకు అందించే అవకాశం ఉందని వివరించారు. తద్వారా ఆరోగ్య శ్రీ పథకానికి కూడా భారం తగ్గుతుందని అన్నారు. ఈ పీ.ఎం రాహత్ పథకం క్రింద చికిత్సలు జరపాలంటే తగు పోలీసు దర్యాప్తు తదితర నిబంధనలను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

వైద్యరంగ నిపుణులకు అవగాహన సదస్సులో జిల్లా జడ్జి

నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 24 (డీకే చాటింపు):వైద్య వృత్తిలో కొనసాగుతున్న వారు వైద్యపరమైన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, వాటిని జాగ్రత్తగా భద్రపర్చాలని జిల్లా జడ్జి జి. వీ. ఎన్. భరతలక్ష్మిసూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులకు, వైద్య రంగ నిపుణులకు వివిధ అంశాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా విచ్చేయగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే తదితరులు పాల్గొ న్నారు. వైద్యుల హక్కులు, వైద్య సేవల్లో చట్టపరమైన బాధ్యతలపై జిల్లా జడ్జి, కలెక్టర్, ఇతర వక్తలు ముఖ్య సూచనలు చేశారు. హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్స్ (ప్రివెన్షన్ ఆఫ్ వయలెన్స్) చట్టం--2025, వైద్య రికార్డుల నిర్వహణ, వాటి చట్టపరమైన ప్రాముఖ్యత, న్యాయ పరమైన విచారణల్లో వాటి ప్రామాణికత తదితర అంశాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించారు. వైద్య సేవలందించే సమయం లో చట్టపరమైన నిబం ధనలను పాటించడం, వైద్య రికార్డులను సక్రమంగా నిర్వహిం చడం, వృత్తిపరమైన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తించడం ద్వారా వైద్యులు, రోగుల హక్కులను పరిరక్షించడంతో పాటు న్యాయ ప్రక్రియకు సహకారం అందించిన వారు అవుతారని ఈ సందర్భంగా అవగాహ న కల్పించారు. న్యాయ వ్యవస్థలో వైద్యులు భాగస్వాములుగా వ్యవహరించాల్సిన ప్రాముఖ్యత గురించి



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.నారాయణ, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.దుర్గాప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని, ట్రైనీ కలెక్టర్ సురేష్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.సుభాష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ.విశాల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, రాష్ట్ర వైద్య మండలి జిల్లా ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ రాథోడ్, రాజ్ కుమార్ సుబే దార్, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, న్యాయవా దులుతదితరులు పాల్గొన్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
ఆదివారం,అక్టోబర్,25, 2026

పేర్లు మారుతున్నాయి.. పరిణామాలు కాదు..!

పేదరికాన్ని జయించి కుటుంబానికి అండగా నిలవాలనే ఆశతో పల్లె నుంచి నగరానికి వచ్చిన 21 ఏళ్ల ఉకే శిరీష జీవితం విషాదంగా ముగిసింది. నర్సుగా సేవలందిం చేందుకు వచ్చిన యువతి తాను నివసిస్తున్న వసతి గదిలోనే దారుణ చర్యకు బలికావడం మహిళల భద్రతపై మరోసారి తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. శిరీష ఘటన మరో విషాదంగా మిగిలిపోకుండా, ప్రతి మహిళకు పని ప్రదేశంలోనూ, నివాసంలోనూ భద్రత కల్పించే వ్యవస్థలపై సమ్రగ సమీక్ష జరగాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. పోలీసుల దర్యాప్తు వివరాల ప్రకారం, నిందితుడు ఆమె కదలికలను కొంతకాలంగా గమనిస్తూ వచ్చి, నిద్రిస్తున్న సమయంలో కిటికీ గుండా గదిలోకి ప్రవేశించి దారుణానికి ఒడిగట్టాడు. ఆధారాలను బట్టి పోలీసులు వేగంగా స్పందించినప్పటికీ, సమాజం ముందు మిగిలిన ప్రశ్నలు మాత్రం ఇప్పటికీ సమాధానం లేనివే. ఒక ఆడపిల్ల తన ఇంటికి దూరంగా వచ్చి, కష్టపడి పనిచేసే చోట కనీస రక్షణను కోరుకోవడం నేరమా? 2012లో ఢిల్లీలో నిర్భయ ఘటన దేశాన్ని కుదిపేసింది. ఆ తర్వాత క్రిమినల్ చట్టాల్లో మార్పులు, షీ టీమ్స్, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, సీసీటీవీలు, అత్యవసర హెల్ప్‌లైన్లు అందుబాటులోకి వచ్చాయి. అయినా మహిళలపై నేరాలు ఆగడం లేదు. 2019లో దిశ, 2024లో కోల్‌కతా ఆర్.జి.కర్ ఘటనల తర్వాత ఇప్పుడు శిరీష ఘటన కూడా అదే వరుసలో నిలిచింది. బాధితుల పేర్లు, పనిచేసే ప్రదేశాలు మారుతున్నాయే తప్ప.. నేరాన్ని ముందే పసిగట్టి అడ్డుకోవాల్సిన యంత్రాంగాల వైఫల్యం మాత్రం కొనసాగుతోంది. మన భద్రతా వ్యవస్థలు నేరం జరిగిన తర్వాత కదిలే అంబులెన్స్‌లా కాకుండా.. ప్రమాదాన్ని ముందే గుర్తించి నివారించే రక్షణ వ్యవస్థగా మారాలి. ఎన్‌సీఆర్‌బీ ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలకు సంబంధించి 4,48,211 కేసులు నమోదయ్యాయి. 2022లో 4,45,256, 2021లో 4,28,278 కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష మంది మహిళలకు జాతీయ నేరాల రేటు 66.2 కాగా, తెలంగాణలో ఏకంగా 124.9గా ఉంది. ఇవి నమోదైన కేసులు మాత్రమే. సామాజిక భయం, కుటుంబ ఒత్తిళ్లతో వెలుగులోకి రాని ఘటనలు మరెన్నో ఉండొచ్చు. తెలంగాణలో షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, టీ-సేఫ్ వంటి వ్యవస్థలు పబ్లిక్ ప్రదేశాల్లో ఉపయోగపడుతున్నప్పటికీ, శిరీష ఉదంతం ప్రైవేట్ సంస్థాగత వాతావరణంలో భద్రతపై ప్రశ్నలు లేవనెత్తింది. మహిళా సిబ్బంది నివాస గదులకు పటిష్టమైన తలుపులు, కిటికీలు, సరైన భద్రత ఉండేలా చూడాల్సిన బాధ్యత యాజమాన్యాలదే. మహిళలను ఎవరైనా నిరంతరం గమనిస్తున్నా గుర్తించలేని సాంకేతిక, మానవ నిఘా వ్యవస్థలు లేకపోవడం లోపమే. నేరం జరిగిన తర్వాత మహిళల స్వేచ్ఛపై ఆంక్షలు విధించడం కాకుండా.. రాత్రి, పగలు ఏ వేళలోనైనా పనిచేసే మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, యాజమాన్యాలు తీసుకోవాలి. శిరీష ఘటన మరో విషాదంగా మిగలకూడదంటే చట్టాల అమలు క్షేత్రస్థాయిలో పటిష్టంగా ఉండాలి. మహిళలు నివసించే హాస్టళ్లు, పీజీలు, పారిశ్రామిక వసతుల్లో 'జెండర్ సేఫ్టీ ఆడిట్' తప్పనిసరి చేయాలి. పని చేసే సీసీటీవీలు, తగిన మౌలిక వసతులు లేని సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. కార్యాలయాల్లో ఖూఊ చ ట్టం అమలుపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. హాట్‌స్పాట్ పెట్రోలింగ్ పెంచడంతో పాటు స్టాకిం గ్ ఫిర్యాదులను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలి. ఈ దారుణానికి ఒడిగట్టిన ఆ దుర్మార్గుడికి విచారణ పేరిట కాలయాపన చేయకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా రెండు మూడు నెలల్లో విచారణ చేసి అత్యంత కఠినమైన, కఠోర శిక్ష విధించాలి. నిందితుడికి పడే కఠిన శిక్ష దెబ్బకు మరే ఆడపిల్లను ఇలాంటి దారుణానికి బలికాకుండా నిరోధించే హెచ్చరికగా నిలవాలి. అలా గే బాల్యం నుంచే అబ్బాయిలకు ఇతరుల ఇష్టాయిష్టాలను, వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించే సంస్కృతిని నేర్పించాలి. మన మధ్య నుంచి దూరమైన శిరీష గానీ, నిర్భయ గానీ, దిశ గానీ మళ్లీ తిరిగి రారు. ఒక దుర్మార్గం జరిగినప్పుడు ఆగ్రహించడం, కొవ్వొత్తులు వెలిగించడం, ఆ తర్వాత మళ్లీ పాత రోజుల్లోకి వెళ్లిపోవడం అనవసరమైన విషవలయం. శిరీష ఘటన మరో విషాదంగా మిగిలిపోకుండా, ప్రతి మహిళకు పని ప్రదేశంలోనూ, నివాసంలోనూ భద్రత కల్పించే వ్యవస్థలపై సమ్రగ సమీక్ష జరగాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. పోలీసుల దర్యాప్తు వివరాల ప్రకారం, నిందితుడు ఆమె కదలికలను కొంతకాలంగా గమనిస్తూ వచ్చి, నిద్రిస్తున్న సమయంలో కిటికీ గుండా గదిలోకి ప్రవేశించి దారుణానికి ఒడిగట్టాడు.



జిల్లా వ్యాప్తంగా
కొనసాగుతున్న లెప్రసీ నిర్ధారణ సర్వే

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 24 (డీకే చాటింపు నిజామాబాద్ జిల్లాలో లెప్రసి కేస్ డిటెక్టేషన్ సర్వే గురు వారం నుండి కొనసా గుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 27 పీహెచ్సీలు 10 అర్బన్ హెల్త్ సెంటర్ల లో ఈ సర్వే కొనసాగుతుందని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ చందర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 150 టీంలు ఏర్పాటు చేసినట్లు ఇందులో ఆశలు సంబంధిత రెగ్యులర్ ఏఎన్ఎంలు సూపర్వైజర్లు పాల్గొనాలని ఉదయం ఏడు నుండి 9 గంటల వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎల్ సి డి సి 22 అక్టోబర్ నుండి 4 నవంబర్ వరకు 15 రోజులపాటు కొనసా గుతుందని సంబంధిత గ్రామ సర్పంచులు తమ వంతు సహకారం అందించి గ్రామాల్లో చాటింపు వేయించా లని విన్నవించారు. లెప్రసీ నివారణకు తగిన మందులుఎంబి, పిబి అని రెండు రకాల మాత్రలు ఉంటాయని వ్యాధి తీవ్రతను బట్టి ఆరు నెలలు కోర్సు, సంవత్సరం కోర్సు ఉంటుందని తెలిపారు. ముదక్ పల్లి డీఎస్సీ పరిధిలో ఈరోజు జరిగిన సర్వేలో డీపీఎమ్ఓ చందర్, సూపర్వైజర్లు, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి పరీక్షలునిర్వహించారు. నిజాంబాద్ బోధన్ ఆర్మూర్ అర్బన్ లో ఎల్సిడిసి సర్వే జరుగుతుండగా కేవలం ఆశలు మాత్రమే ఈరోజు సర్వే చేస్తున్నారు. సంబంధి త సూపర్వైజర్లు ఫీల్డ్ లో ఎక్కడ వెళ్లిన దాఖలాలు లేవు. ఆశల తో పాటు ఏఎన్ఎంలు సూపర్వైజర్లు డోర్ టు డోర్ సర్వే చేయాల్సి ఉండగా అర్బన్ లో కనబడలేదు. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్లలో ఇద్దరు



సూపర్వైజర్ కేడర్ అధికారులు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు మెడికల్ ఆఫీసర్లు ఉన్నప్పటికీ సర్వేలో అందుబా టులో లేరు. ఉదయం ఏడు నుంచి తొమ్మిది లోపల సర్వేలో పాల్గొనాల్సి కొద్దిమంది ఆశాలు మాత్రమే సర్వే లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వ్యాధి గుర్తింపులో నిష్ణాతు లైన సూపర్వై జర్లు డాక్టర్లు సర్వేలో ఉండా ల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలా ఉండగా సర్వే పై డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ వివరణ కై సంప్రదించగా అందుబాటులోకి రాలేకపోయారు.

టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశం



డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్):భవన్‌లోని ఇందిరా భవన్‌లో టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశం చైర్మన్ అశోక్ గౌడ్ అధ్యక్షతన శనివారం జరిగింది.సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఏఐపిసి చైర్మెన్ మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రాంమోహన్ రెడ్డితో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. సమావేశంలో లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీపిఓ పై అనుచిత వ్యాఖ్యల తీరును ఖండన...
- మాజీ కౌన్సిలర్ తాండ్ర రామకృష్ణ పై చర్యలు తీసుకోవాలి...
మున్సిపల్ ఉద్యోగుల నల్ల బ్యాడ్జీల నిరసన



బెల్లంపల్లి(డీకే చాటింపు)మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి సునీల్ పై మాజీ కౌన్సిలర్ తాండ రామకృష్ణ అనుచితంగా వ్యవహరిస్తూ, అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ ఈ నెల 23 న మాజీ కౌన్సిలర్ తాండ రామకృష్ణ బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి వచ్చి, రోడ్డు వెడల్పునకు సంబంధించిన ఆర్టీపీ సర్టిఫికెట్ ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారిని కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన టిపిఓ కోరిన సమాచారాన్ని నిబంధనలకు అనుగుణంగా సమర్పించాల్సి ఉంటుందని, సంబంధిత సమాచారాన్ని సమాచార హక్కు చట్టం కింద అధికారికంగా దరఖాస్తు చేసుకున్నట్లయితే, దరఖాస్తును పరిశీలించి,నిబంధనల ప్రకారం సమాచారాన్ని అందించడం జరుగుతుందని వివరించినట్లు తెలిపారు.అయితే, ఈ విషయంపై రామకృష్ణ అసహనం వ్యక్తం చేస్తూ, విధి నిర్వహణలో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారితో అనుచితంగా మాట్లాడి, తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుతూ వ్యవహరించినట్లు కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవలందించేందుకు, చట్టాలు మరియు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించేందుకు నియమితులవుతారు. ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారు సైతం ప్రభుత్వ ఉద్యోగుల విధి నిర్వహణను గౌరవిస్తూ, సమస్యలు లేదా అభ్యంతరాలు ఉన్నప్పుడు వాటిని చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సిబ్బంది సూచించారు. కార్యాలయాల్లో ప్రశాంతమైన, గౌరవప్రదమైన వాతావరణం కొనసాగడం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారుల పట్ల అనుచితంగా వ్యవహరించడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడడం వంటి ఘటనలు ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు వారి పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలకు అందించాల్సిన మున్సిపల్ సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని, కార్యాలయ సిబ్బంది చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు మరియు సంబంధిత నిబంధనలకు అనుగుణంగా తమ విధులను నిర్వర్తిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు

సర్వే లోపాలను సరిదిద్ది ప్రచురించాలి
బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం



డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్): రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర కుల సర్వేలోని లోపాలను సరిదిద్దకుండా దేశానికి 'రోల్ మోడల్' అని ప్రకటించుకోవడం కేవలం ప్రచార ఆర్భాటమేనని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు విమర్శించారు. జనాభా వివరాల్లో తప్పులను సరిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై స్పందిస్తూ ప్రభుత్వం వెంటనే దీనిపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు.అధికారిక సర్వేలో మిగిలిపోయిన కుటుంబాలను నమోదు చేయడంతో పాటు కులాల పేర్లు, వర్గీకరణలలో ఉన్న అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలన్నారు. చట్టబద్ధమైన రాష్ట్ర బీసీ కమిషన్‌ను పక్కన పెట్టడం వల్లే ఈ వివాదాలు తలెత్తాయని తెలిపారు. సర్వే మొత్తాన్ని తిరిగి చేయాల్సిన అవసరం లేదని, విడిపోయిన కుటుంబాలను చేర్చి, తప్పులను సరిదిద్ది ఆ వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

అడ్వకేట్ కావలసింది మిస్సయింది
టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్



డీకే చాటింపు ప్రతినిధి, (హైదరాబాద్): అడ్వకేట్ ప్రొఫెషన్ గౌరవం, కటినంతో కూడుకున్నది.నేను అడ్వకేట్ కావలసింది మిస్ అయ్యింది.అడ్వకేట్ వృత్తి నుంచి వచ్చినవారు రాజకీయాల్లో చాలా మంది రాణించారని పి సీ సీ చీఫ్ బొమ్మ మహేష కుమార్ గౌడ్ అన్నారు.రాజ్యాంగ బద్ద సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోంది.దేశంలో కొన్ని జడ్జిమెంట్స్ చూసి ఆశ్చర్యపోతున్నామని ఆయన అన్నారు. గాంధీ భావసన్ లో శుక్రవారం జరిగిన లెస్లా సెల్ కార్యవర్గ సమావేశంలో పాల్గొని ప్రసునగించారు.ఎలక్షన్ కమిషన్ ను జేబు సంస్థగా వాడుకుంటున్నారు.సీబీఐ, ఈడి ఇష్టానుసారం వాడుతున్నారు. స్టెఫండ్స్ పెంచుకుందాం.దేశంలో ఎక్కడ లేని విధంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొచ్చాం. నవంబరు లో సీఎం రేవంత్ రెడ్డి తో అడ్వకేట్ సమస్యలపై చర్చించుకుందాం.దేశంలో ఎక్కడ లేని విధంగాఅభివృద్ధి,సంక్షేమం 80 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామా రామ్మోహన్, సర్వోత్తమ్ ని గెలిపించండని మహేష్ కుమార్ పిలుపునిచ్చారు.

ఎన్.హెచ్.ఏం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి
-రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మనోహర్ ప్రసాద్ గౌడ్... -ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల సమ్మెకు రిటైర్డు ఉద్యోగ సంఘం మద్దతు... -ప్రభుత్వాలు మారుతున్నా ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదు... -నారాయణపేటలో 12వ, రోజుకు చేరుకున్న రిలే దీక్షలు...



నారాయణపేట,(డీకే చాటింపు): తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్.హెచ్.ఏం జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటితో నారాయణపేట జిల్లాలో 12 వ,రోజుకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల నిరసన కార్యక్రమానికి జిల్లా,పట్టణ రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మనోహర్ ప్రసాద్ గౌడ్,ప్రధాన కార్యదర్శి వామనగేరీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్.హెచ్.ఏం ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు.ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులు నేటికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య పనిచేయాల్సి వస్తోందన్నారు.మహిళా ఉద్యోగులకు180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు తప్పని సరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్.హెచ్.ఏం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి తమ్మలి సత్యనారాయణ,పట్టణ అధ్యక్షులు భరత్,కే. సత్యనారాయణ,కృష్ణయ్య ఉన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బిక్షపతి, అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి రాఘవేందర్, ఎన్.హెచ్.ఎం యూనియన్ సభ్యులు డాక్టర్లు వెంకట రమణ,మోనేష్ చారి, నరసింహ రావు సగరి, తిరుపతి,అర్చన, రామస్వామి,మునీర్, హబీబ్,సోహెల్,వినోద్, నరేందర్,విజయ్,కిరీటి, నవశ్రీ,విరోజ,చందన, అనురాధ,సౌందర్య,పుష్ప, సావిత్రమ్మ,దేవిక,సుజాత, శ్వేతశ్రీ,ఉద్యోగులు అజారుద్దీన్,డీడీఎం స్నేహలత,డిఏఏం మమత తదితరులు పాల్గొన్నారు.

నేడే జడ్చర్లలో బ్రాహ్మణ శంఖారావం
-సనాతన ధర్మ పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం... -నారాయణపేట జిల్లా బ్రాహ్మణ సంఘం మహిళా నాయకురాలు యాద్గీర్ మంగళ విజయాచారి...



నారాయణపేట,(డీకే చాటింపు): సనాతన ధర్మ పరిరక్షణ కొరకు,వైదిక సాంప్రదాయాల పరిరక్షణకు బ్రాహ్మణ సమాజ ఐక్యతకు వేదికగా ఆదివారం జడ్చర్ల వాసవి కల్యాణ మండపంలో విరాట్ రూపంలో జరిగే ఉమ్మడి పాలమూరు జిల్లా బ్రాహ్మణ శంఖారావం కార్యక్రమానికి మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తద్వారా బ్రాహ్మణ మహిళా శక్తిని చాటాలని నారాయణపేట జిల్లా బ్రాహ్మణ సంఘం మహిళా నాయకురాలు యాద్గీర్ మంగళ విజయాచారి కోరారు.బ్రాహ్మణ వీరనారీమణి ఝాన్సీబాయి లాంటి మహనీయ మహిళల స్ఫూర్తితో బ్రాహ్మణ మహిళలు అత్యధిక సంఖ్యలో ఇట్టి శంఖారావం కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. కేవలం ఇంటి పనులు చక్కబెట్టడం వరకే మహిళ బాధ్యత తీరిపోదనే బ్రాహ్మణ సంస్కృతీ సాంప్రదాయాలను చక్కబెట్టి భావితరాలకు వారసత్వ సంపదగా అందించే గురుతర బాధ్యత కూడా బ్రాహ్మణ మహిళలపై ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో భళ్ళారి విద్యా,వసంత కొప్రేషాచారి, సంగ్వార్ భాను గోపీనాథ్ రావ్,పట్వారి జ్యోత్స్న, కులకర్ణి మేఘన తదితరులు పాల్గొన్నారు.

టెహ్రాన్‌లో భారీ ప్రదర్శన
ఇరాన్ రక్షణ కోసం నిరసన

పశ్చిమాసియాలో యుద్ధం మొదలై నెలలు గడుస్తున్నా.. దుందుడుకు చర్యలు మాత్రం ఆగడం లేదంటూ అమెరికా తీరుపై ఇరాన్‌లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతు న్నాయి. దేశ ఐక్యతను ప్రతిబింబించేలా ప్రభుత్వ సూచన మేరకు శుక్రవారం టెహ్రాన్‌లో లక్షలాది మంది ఇరాన్ పౌరులు రోడ్లపైకి వచ్చారు. 'జాన్-ఫాదా' అనే నినాదం (తమ ప్రాణాలను త్యాగం చేసేవారు)తో జాతీయ పతాకాన్ని చేతబట్టి భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. దేశం కోసం తాము ఆయుధాలు పట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రతిజ్ఞ చేశారు. అమెరికా, ఇజ్రాయిల్ నాశనమవ్వాలంటూ నినాదాలు చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుల చిత్రాలు ఉన్న శవపేటికలను ప్రదర్శించారు. వారిద్దరి చిత్రపటాలపై కాళ్లతో తొక్కుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇరాన్ పోర్టుల దిగ్బంధం సహా పలు ఆంక్షలు విధించడంపై మండిపడ్డారు. అయితే ఇరాన్‌లో యుద్ధం మొదలైన తర్వాత చేపట్టిన అతి పెద్ద ర్యాలీ ఇదే. ఇరాన్-ఇరాక్ యుద్ధాన్ని స్మరించుకోవడానికి, ఎనిమిదేండ్ల సంఘర్షణలో సేవ చేసి, మరణించిన వారిని గౌరవించుకోవడానికి ఇరాన్‌లో ప్రతి ఏటా సెప్టెంబర్ 22న ఈ వారోత్సవాలు నిర్వహిస్తారు.

ఐపీ చానళ్ళకు అక్రెడిటేషన్లు లేవు

తేల్చి చెప్పిన మంత్రి పొంగులేటి

-జర్నలిస్టుల ఇళ్ళస్థలాలు, ఇతర సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం



హైదరాబాద్, (డీకే చాటింపు): రాష్ట్రం కేబుల్ టీవీల స్థానంలో నడుస్తున్న ఇంటర్నెట్ ప్రోటోకాల్ టెలివిజన్(ఐపీ) ఛానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడం కుదరదని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తేల్చి చెప్పారు. ఇప్పటికే 26 వేల అక్రెడిటేషన్ కార్డులిచ్చామని,గతంలో కంటే నాలుగు వేల కార్డులు ఎక్కువే ఇచ్చామని, గతంలో లేని ఐపీ చానళ్ళకు కొత్తగా అక్రెడిటేషన్ కార్డులివ్వలేమని ఆయన స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలో కేబుల్ చానల్స్ ప్రతినిధులు, పలువురు ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో మంత్రి పొంగులేటి ని కలిసి కేబుల్ ఐపీ చానళ్ళకు అక్రెడిటేషన్ కార్డులు, జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించి, సొంతంటి కలను సాకారం చేస్తామని మంత్రి అన్నారు. జర్నలిస్టులకు గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఇళ్ళస్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల పంపిణీ కూడా పారదర్శకంగా కొనసాగు తుందని, గత ప్రభుత్వం కేవలం 21వేల అక్రెడిటేషన్లు ఇస్తే... తమ ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 26వేల అక్రెడిటేషన్లు ఇచ్చిందని చెప్పారు. అక్రెడిటేషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని, అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు ఇస్తామని మంత్రి అన్నారు. అంతకుముందుఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య మంత్రితో మాట్లాడుతూ, రాష్ట్రంలో కొన్నేళ్ళుగా కేబుల్ నెట్వర్క్ ద్వారా నడిచిన అనేక న్యూస్ చానళ్ళు ప్రస్తుతం మారిన టెక్నాలజీకి అనుగుణంగా ఐపి ద్వారా నడుస్తున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఐపీ టీవీ న్యూస్ ఛానళ్ళకు కూడా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఎంతోమంది జర్నలిస్టులు ఇళ్ళస్థలాల కోసం ఎన్నో ఏళ్ళుగా ఎదిరిచూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకూ హెల్త్ కార్డులు జారీ చేయాలని, అరవై ఏళ్ళ వయసు పైబడి సీనియర్ పాత్రికేయులకు పెన్షన్ స్కీం అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, రవికుమార్, కేబుల్ చానెల్ అసోసియేషన్ ప్రతినిధులు సుభాష్, భరత్, శ్రీరాములు, షఫియుద్దీన్, ప్రతాప్, రాచర్ల గోపి, సుధాకర్, విజ్ఞేష్ గౌడ్ తదితరులున్నారు.

మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనలో పాల్గొన్న

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎమ్మెల్యేలు



మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా(డీకే చాటింపు): మేడిగడ్డ బ్యారేజీ నుంచి వృథాగా పోతున్న నీటిని, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఈ కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. మేడిగడ్డ నిర్వహణ, నీటి వనరుల వాడకంపై సమీక్ష అవసరమని, ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని శాసనసభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను, నీటి ప్రవాహాన్ని, వృథాగా వెళ్తున్న నీటిని నిశితంగా పరిశీలించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రజాధనంతో నిర్మించిన భారీ సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, నిర్వహణ, నీటి వనరుల వినియోగం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ఈ పర్యటనలో ప్రధాన అంశంగా నిలిచింది. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుల పరిరక్షణ అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యేలు చెప్పారు. 'తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం, సాగునీటి అవసరాలు, తాగునీటి సరఫరా, రైతుల జీవనోపాధి వంటి అంశాలకు సాగునీటి ప్రాజెక్టులు ఎంతో కీలకమైనవి. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులు ఆశించిన ప్రయోజనాలను అందించాలంటే వాటి నిర్మాణ నాణ్యత, నిర్వహణ, భద్రత, నీటి నిల్వ సామర్థ్యం వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. నీరు వృథాగా వెళ్లకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా వినియోగించే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రైతుల ప్రయోజనాలే సాగునీటి ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అవసరమైన సమయంలో నీరు అందడం, వ్యవసాయ ఉత్పత్తి పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం ఎంతో ముఖ్యమైన అంశాలు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణలో తలెత్తే సమస్యలను గుర్తించడం, సాంకేతిక నిపుణుల ద్వారా వాటి స్థితిగతులను అంచనా వేయించడం, అవసరమైన చర్యలు చేపట్టడం ప్రభుత్వాల బాధ్యత. మేడిగడ్డ బ్యారేజీ వద్ద వృథాగా వెళ్తున్న నీటిని, ప్రాజెక్టు పరిస్థితిని పరిశీలించడం ద్వారా నీటి వనరుల పరిరక్షణ, సమర్థ వినియోగం, సాగునీటి ప్రయోజనాలపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది. ప్రాజెక్టు పరిస్థితిపై సమగ్ర సాంకేతిక పరిశీలన జరిపి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టడం అవసరమనే అంశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రజాప్రయోజనాల పరిరక్షణకు నిరంతర పర్యవేక్షణ అవసరం. ప్రజాధనంతో నిర్మించిన భారీ ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా, వాటి భద్రత, నిర్వహణ, నీటి వినియోగంపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సాగునీటి వనరులు రైతులకు ఉపయోగపడేలా ప్రణాళికాబద్ధంగా వినియోగించడంతోపాటు ప్రాజెక్టుల పరిస్థితిపై పారదర్శకంగా వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం కూడా కీలకం' అని శాసనసభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితు లకు మెరుగైన వైద్యం అందించేందుకు

పీఎం రాహత్ పథకంను సద్వినియోగం చేసుకోవాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు





నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 24 (డీకే చాటింపు): రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించడంలో పీఎం రాహత్ పథకం కీలకంగా నిలుస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకునేలా చూడా లని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. పీఎం రాహత్ (ప్రైమ్ మినిస్టర్ రోడ్ ఆక్సిడెంట్ విక్టిమ్స్ హాస్పిటలిజేషన్ అండ్ అస్యూర్డ్ ట్రీట్మెంట్) పథకం అమలుపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి సీ.ఎస్ సంజయ్ జాజు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్యం అందించడం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల అను సంధానం, నిధుల విడుదల ప్రక్రియపై చర్చించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని ఆసుపత్రిలో చేర్పించ డానికి పోలీస్ ఆమో దిత కేసులకు గరిష్టంగా 1 లక్షా 50 వేల రూపా యల వరకు పూర్తి చికిత్స అందించే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదం తర్వాత బాదితుల ప్రాణాలు కాపాడేందు కు గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని, ఈ సమ యంలో వేగంగా స్పందించాలని అన్నారు. ఈ పథకం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసు కొని, జిల్లా ఇన్ఫర్మా టిక్స్ అధికారులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయాలని సూచిం చారు. ప్రమాదాల నివారణకు, బాధితుల వివరాలను పారద ర్శకంగా నమోదు చేయడానికి టీఎంఎస్ 2.0 పోర్టల్‌ను సద్వి ని యోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా బాధితుల చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలలో ఈ పథకంపై అవగా హన కల్పించాలని అన్నారు. ప్రతి జిల్లాలో నూ ఈ పథకం అమ లును కలెక్టర్లు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని సీఎస్ స్పష్టం చేశారు. వీసీ అనంత రం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు పలు సూచనలు చేశారు. పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాల న్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి, వారి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాల న్నారు. ప్రమాద సమా చారం అందుకున్న వెంటనే సంబంధిత శాఖలు వెంటనే అప్రమత్తమవ్వాలని అన్నారు. నగదు, బాదితుల సమాచారం అందుబాటులో లేని కారణంగా వైద్యసేవలు నిరాకరించకూడ దన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వ యంతో ఉండి ప్రమాదా ల వల్ల కలిగే ప్రాణ నష్టాలను తగ్గించాలని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ లు రాజాగౌడ్, భుజంగ రావు, జిల్లా రవాణా శాఖ అధికారి రమేష్ రాథోడ్, వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, జిల్లా ఆసుపత్రుల సమన్వ యకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఈ-దార్ జిల్లా మేనేజర్ వర్ష నిహంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి నాయకపోడ్ విద్యార్థులు, నిరుద్యో గుల

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కృషి



ఆర్మూర్ విలేఖరి అక్టోబర్ 24 (డీకే చాటింపు): హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాల యంలో ఆర్మూర్ ఎమ్మెల్యే శ్రీ పైడి రాకేష్ రెడ్డిని నిజామాబాద్ జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, గౌరవ అధ్యక్షుడు బండారి బోజన్న కలిసి వినతిపత్రం అందజేశారు.ఆదివాసి నాయకపోడ్ విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందే సమయంలో, అలాగే ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అనంతరం కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన పేరుతో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ జాప్యం వల్ల విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలను, నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని వివరించారు.ఈ సమస్యపై ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి వెంటనే స్పందించి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ గదృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారు లతో మాట్లాడించి, ఆదివాసి నాయకపోడ్ విద్యార్థులు, నిరుద్యో గులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకపై కాలయాపన లేకుండా సమస్యను పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చినట్లు సంఘ నాయకులు తెలిపారు. తమ సమస్యలపై వెంటనే స్పందించి, మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కి ఆదివాసి నాయకపోడ్ సంఘ నాయకులు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, గౌరవ అధ్యక్షుడు బండారి బోజన్న, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి దేగాం గంగ సాయన్న, న్యాయవాది అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ మాదిరి.. రేవంత్



హైదరాబాద్ : తెలంగాణలో త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక కేవలం ఒక సాధారణ నియోజకవర్గ పోరుగానే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రభావం చూపే హై-వోల్టేజ్ ఫైట్ గా మారుతోంది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి, ఆయన వ్యూహాత్మక ఎత్తుగడలకు ఈ ఎన్నిక ఒక పెద్ద సవాల్‌గా నిలవనుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజ శేఖర రెడ్డి ఎదుర్కొన్న రాజకీయ సవాళ్లను, నేటి రేవంత్ రెడ్డి రాజకీయ శైలితో బేరీజు వేస్తూ విశ్లేషకులు ఈ ఉపఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా చూస్తున్నారు.ఒకప్పుడు వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ఇదే తరహా రాజకీయ పరిణామాలు తలెత్తాయి. అప్పుడు దానం నాగేందర్ టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరి ఆసిఫ్ నగర్ ఉపఎన్నిక బరిలో నిలిచారు. అయితే ఆ ఎన్నికల్లో దానం నాగేందర్ ఓడిపోయారు. అప్పట్లో వైఎస్సార్ ఆ ఎన్నికను వ్యక్తిగతంగా తీసుకోలేదని, అందుకే ఓడిపోయారని చెప్పుకునేవారు.అయితే ఇప్పుడు తెలంగాణ రాజకీయ వాతావరణం పూర్తిగా భిన్నంగా ఉంది. ముఖ్యమంత్రి పీఠంపై ఉన్న రేవంత్ రెడ్డి ప్రతి చిన్న పరిణామాన్ని అత్యంత సూక్ష్మంగా పరిశీలిస్తూ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరిన దానం నాగేందర్ ఎదుర్కొంటున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలు, భవిష్యత్ ఎన్నికల దిశను నిర్దేశించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, అధికార పార్టీ తరఫున ఆయనే బరిలో నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఖైరతాబాద్ గడ్డపై త్రిముఖ పోరు అనివార్యంగా కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ ఈ ఉపఎన్నికను తమ సత్తా చాటుకునేందుకు సరైన వేదికగా భావిస్తున్నాయి. 2028 అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు ముందు ప్రజల నాడి ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ ఉపఎన్నిక ఒక లిట్మస్ టెస్ట్ లాంటిదని అన్ని పార్టీలు నమ్ముతున్నాయి.ఒకవైపు అధికార పార్టీగా సంక్షేమ పథకాలు, పాలనాపరమైన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ భావిస్తుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో తమ వట్టును నిరూపించుకోవడానికి ప్రతిపక్షాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో నియోజకవర్గంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం ఉందనే ధీమాతో ఉన్న దానం, ప్రత్యర్థుల వ్యూహాలను ఎదుర్కొనేందుకు సరికొత్త ప్రణాళికలు రచిస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార సరళి, పోలీసులు, స్థానిక ప్రజల స్పందన అన్నీ కూడా రాజకీయంగా ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.ఈ ఉపఎన్నిక కేవలం దానం నాగేందర్ రాజకీయ భవిష్యత్తును మాత్రమే కాదు, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమను కూడా పరీక్షించనుంది. గతంలో వైఎస్సార్ ఎదుర్కొన్న రాజకీయ అడ్డంకులను అధిగమించి, ఈసారి రేవంత్ రెడ్డి సరికొత్త చరిత్రను తిరగరాస్తారా లేదా అనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ ముల

సందర్భంగా వ్యాసరచన పోటీల నిర్వహణ





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 24(డీకే చాటింపు): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవములలో భాగంగా (పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా) నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలలోని 1) కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు పోలీస్ అమరవీరుల దినోత్సవము సందర్భంగా " వ్యాస రచన పోటీలు" తెలుగు ఉర్దూ, ఇంగ్లీషులో భాషలలో ఉదయం నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు. 2) ఎస్.ఐ నుండి ఆ పై స్థాయి వరకు పోలీస్ అమరవీరుల దినోత్సవము సందర్భంగా " వ్యాస రచన పోటీలు" తెలుగు ఉర్దూ, ఇంగ్లీషులో భాషలలో ఉదయం నుండి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించడం జరిగింది. పౌరుల మన్ననలు పొందడానికి పోలీసులు చేయవలసిన కృషి అనే అంశాల మీద పోటీలు నిర్వహించా మనీ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రూట్ మ్యాప్



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ప్రవాహం, పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాతీయ స్థాయిలో సరికొత్త ఎజెండాను బలంగా వినిపిస్తున్నారు. ఢిల్లీ వేదికగా పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలతో పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫైర్‌సైడ్ చాట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దశాబ్దాలుగా అమలు చేస్తున్న సమర్థవంతమైన పాలనా నమూనాను గుర్తుచేస్తూ.. పని, జవాబుదారీతనం, నాణ్యమైన సేవలు అనే మూడు మూలస్తంభాలపైనే తమ ప్రభుత్వం నడుస్తోందని స్పష్టం చేశారు. ఒకప్పుడు ప్రపంచమంతా మాట్లాడిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశ దాటిపోయిందని, ఆధునిక పోటీ ప్రపంచంలో వేగమే సర్వస్వమని, అందుకే కూటమి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను తమ అధికారిక పాలనా నంస్కృతిగా మార్చుకుందని లోకేష్ ప్రకటించారు.పరిపాలనలో జవాబుదారీతనం కేబినెట్ మంత్రుల స్థాయి నుంచే మొదలవుతోందని లోకేష్ స్పష్టం చేశారు. మంత్రుల పనితీరు నివేదికలు , ఫైళ్ల పరిష్కార వేగం , మంత్రుల ర్యాంకింగ్‌లు, క్షేత్రస్థాయిలో కలెక్టర్లతో లైవ్ రివ్యూ సమావేశాలు నిర్వహించడానికి అపారమైన రాజకీయ ధైర్యం అవసరమని పేర్కొన్నారు. ఇలాంటి కఠినమైన పనితీరును ఐదేళ్లపాటు నిరంతరాయంగా కొనసాగిస్తే, ఆ జవాబుదారీతనం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రతి గ్రామంలోని కింది స్థాయి ఉద్యోగి వరకు చేరుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇకపై దేశంలోనే ఇన్వెస్ట్‌మెంట్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని ఫైర్‌సైడ్ చాట్ వేదికగా మంత్రి నారా లోకేష్ ధీమా వ్యక్తం చేశారు.

అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు



హైదరాబాద్, : తెలంగాణలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జీవో నెం.455, 456, 747, 92 కింద ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హమైన కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మరోవైపు 22ం భూముల సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. జీవో 118, 76కు అనుగుణంగా చర్యలు చేపట్టామని, మిగిలిన సమస్యలను కూడా వేగంగా పరిష్కరిస్తామని వెల్లడించింది.రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పరిశీలించి, అర్హమైన కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. జఒఅ పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వుల అమలులో జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. 2016లో జీవోలు జారీ చేసినప్పటికీ అప్పట్లో వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు.ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం తాజాగా మెమో నెం.48062 జారీ చేసినట్లు వెల్లడించారు. జీవో నెం.455, 456, 747, 92 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అర్హత కలిగిన ప్రతి కేసును సంబంధిత నిబంధనలు, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిశీలనలో భూమికి సంబంధించిన పత్రాలు, గతంలో జారీ చేసిన ఉత్తర్వులు, చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అర్హులైన భూ యజమానులకు నిబంధనల ప్రకారం పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రంలో భూములు 22ం నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీల మేరకు ఈ అంశాన్ని దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 22ం సమస్యలకు సంబంధించి మూడు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. జీవో నెం.118, జీవో నెం.76కు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొంది. భూములు 22ం జాబితాలో ఉన్నప్పటికీ చట్టబద్ధమైన అనుమతులు కలిగిన కొన్ని ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఉన్న అడ్డంకులను తొలగించే చర్యలు చేపట్టినట్లు తెలిపింది. అయితే 22ం జాబితాలో ఉన్న ప్రతి భూమికి ఒకే విధమైన పరిష్కారం వర్తించదు. భూమి స్వభావం, యాజమాన్య పత్రాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టపరమైన అర్హతలను పరిశీలించిన తర్వాతే సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు అర్హులైన వ్యక్తుల సమస్యలను వరిష్కరించడం ఈ ప్రక్రియలో కీలకమని ప్రభుత్వం పేర్కొంటోంది.ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలకు అదనంగా.. మిగిలిన 22ం భూ సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఒక్కో కేసును పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించింది. జఒఅ, 22ం సమస్యల పరిష్కారంతో భూ యజమానులకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గడంతో పాటు, అర్హత ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం కానుంది. అయితే.. తాజా మెమో అమలు, దరఖాస్తుల పరిశీలన, సంబంధిత ఉత్తర్వుల ఆధారంగా కేసుల పరిష్కారం ఎలా సాగుతుందన్నది కీలకంగా మారింది.

కార్పొరేషన్స్ విజయవాడ, విశాఖలలో డివిజన్ల పెంపు



విజయవాడ , : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను వీలైనంత త్వరగ నిర్వహించాలనే గట్టి సంకల్పంతో ఉన్న కూటమి ప్రభుత్వం అందుకోసం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా పలు కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో డివిజన్లు, వార్డుల సంఖ్య పెంపుపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అత్యంత విజయవాడ నగర పాలక సంస్థలో డివిజన్ల సంఖ్యను భారీగా పెంచింది. ఇప్పటి వరకూ 64 డివిజన్లుగా విజయవాడ కార్పొరేషన్‌లో కొత్తగా మరో 22 డివిజన్లను జోడించారు. మొత్తం 86 డివిజన్లకు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.మున్సిపల్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఈ ఏడాది మే నెలలో డివిజన్ల పెంపు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. అదే నెల 18 నుంచి 24 వరకు ప్రజలు, వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలు, సూచనలను స్వీకరించారు. వీటి ఆధారంగానే విజయవాడ కార్పొరేషన్‌లో డివిజన్లను 86కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియలో అత్యధిక మార్పులు విజయవాడ ఈస్ట్ నియోజకవర్గ పరిధిలోనే చోటుచేసుకోవడం గమనార్హం. ఇప్పటివరకు ఆ నియోజకవర్గంలో 21 డివిజన్లు ఉండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 29కి చేరింది. ప్రజల నుంచి పెద్దగా అభ్యంతరం వ్యక్తం కాకపోవడంతో 86 డివిజన్లను అధికారికంగా ఖరారు చేశారు. నగరంలో పెరుగుతున్న జనాభా, భౌగోళిక విస్తరణ, మెరుగైన పాలన అందించడం కోసమే డివిజన్లను పెంచినట్టు ప్రభుత్వం పేర్కొంది.రాజధాని అమరావతి పరిధిలో అత్యంత కీలకమైన నగర పాలక సంస్థ విజయవాడ కార్పొరేషన్. ఇక్కడ ఎన్నికలు రాజకీయంగా ఆసక్తిని రేపుతున్నాయి. ఈసారి మేయర్‌ను ప్రత్యక్ష ఎన్నిక విధానంలో ఎన్నుకునే అవకాశం ఉంది. దీంతో బెజవాడ నగర మేయర్ పదవికి పోటీ తీవ్రంగా ఉంది. అధికార టీడీపీ నుంచే దాదాపు 15 మందికిపైగా మేయర్ టికెట్ కోసం పోటీ పడుతుంటే.. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలు కూడా తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోడానికి వ్యూహాలను రచిస్తోంది.కొత్త డివిజన్ల ప్రకారం 2 నుంచి 30 వరకు సరిహద్దులను పునర్నిర్వచించారు. వీటి సరిహద్దులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచింది ప్రభుత్వం. నగర విస్తరణ, జనాభా పెరుగుదల, పాలనా సౌలభ్యం, అభివృద్ధి పనుల సమర్థ నిర్వహణను దృష్టిలో ఉంచుకుని డివిజన్ల సంఖ్య పెంపు నిర్ణయం తీసుకుంది.

ఇక విశాఖలో...

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) వార్డుల పునర్విభజనకు ఆమోద ముద్ర పడింది. ఈ మేరకు గెజిట్ సెప్టెంబర్ 14, 2026 విడుదల చేశారు. జీవీఎంసీ పరిధిలోని వార్డుల సంఖ్యను 98 నుంచి 120కి పెంచుతూ/పునర్విభజిస్తూ తుది నోటిఫికేషన్ విడదలైంది. అంతేకాదు వార్డులకు సంబంధించి సరిహద్దులను కూడా ఖరారు చేశారు.. 120 వార్డులతో జీవీఎంసీకి త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏపీ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 24న జీవీఎంసీ వార్డుల పునర్విభజన ప్రక్రియ కోసం జీవో 65, మే 17న నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న 98 వార్డుల్ని 120కి పెంచుతూ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే జీవీఎంసీ వార్డుల పునర్విభజన జీవో, నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ విశాఖపట్నానికి చెందిన భాగవతుల నరసింహవ్రతావ్‌తో పాటుగా మరొకరు హైకోర్టును ఆశ్రయించారు.దేశంలో జనగణన-2027 ప్రారంభమైందని.. వార్డుల సరిహద్దులు నిర్ణయించడానికి వీల్లేదని వాదనలు వినిపించారు. ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించకుండా వార్డుల పునర్విభజన సరికాదన్నారు.. వెంటనే ఈ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు సింగిల్ జడ్జి మే 29న విచారణ జరిపి.. ఈ ఏడాది మే 17న జీవీఎంసీ వార్డుల పునర్విభజనపై ముందుకు వెళ్లొద్దని ఆదేశించారు. అయితే ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి, జీవీఎంసీ కమిషనర్ సింగిల్ జడ్జి ఉత్తర్వుల్ని హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన హైకోర్టు జనాభా లెక్కలకు, వార్డుల పునర్విభజనకు సంబంధం లేదని వ్యాఖ్యానించింది. జీవీఎంసీ సరిహద్దు మార్చకుండా వార్డుల పునర్విభజన మాత్రమే చేస్తున్నారు కాబట్టి ఈ పిటిషన్‌పై విచారణ జరపాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతూ కొట్టేసింది. దీంతో జీవీఎంసీ వార్డుల విభజనకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.జీవీఎంసీ అధికారులు హైకోర్టు తీర్పు తర్వాత వార్డుల పునర్విభజన ప్రక్రియను ప్రారంభించారు. వార్డుల పునర్విభజనకు సంబంధించి ఇప్పటికే ప్రాథమిక ముసాయిదాపై ప్రజల నుంచి అభ్యంతరాలను పరిశీలించారు. దీంతో తుది ముసాయిదాను తయారుచేసి ప్రభుత్వానికి పంపించగా అనుమతి వచ్చింది. మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి ప్రభుత్వానికి పంపగా.. తాజాగా ఏపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వార్డుల పునర్విభజనకు నోటిఫికేషన్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరనున్నారు. మొత్తం మీద జీవీఎంసీలో 120 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియను అక్టోబరు చివరినాటికి పూర్తిచేస్తేనే కేంద్రం నుంచి 16వ ఆర్థిక సంఘం నిధులు విడుదలు కానున్నునాయి. కనుక ఆలోగా ఎన్నికలు పూర్తిచేసే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది

గెలుపు గుర్రాల కోసం వేట

హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక ఖాయమయింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. అయితే ఈ ఉప ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు పోటీ పడనున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్యనే పోరు ఉండనుంది. త్రిముఖ పోరులో గెలుపు ఎవరిదన్న లెక్కల్లో ఇప్పుడు రాజకీయ పార్టీలు ఉన్నాయి. అభ్యర్థుల ఎంపిక కీలకం కానుంది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థిపై గెలుపొందారు.అయితే, ఇటీవల దానం నాగేందర్ అనర్హత వేటుకు గురికావడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం ఇంకా షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలో అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరుగుతున్నాయి.. ఖైరతాబాద్ నియోజకవర్గంలో దానం నాగేందర్ కు గట్టి పట్టుంది. కాంగ్రెస్ నుంచి ఒకసారి, బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు ఇక్కడి నుంచి గెలిచారు. ఆయన వ్యక్తిగత బలం కొంత తోడయ్యే అవకాశముంది. అధికార కాంగ్రెస్ నుంచి దానం నాగేందర్ పోటీ చేసే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఒకింత కొంత అడ్వాంటేజీ అని అంటున్నారు. హైదరాబాద్ నగరంలో జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలిచింది. కంటోన్మెంట్, జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడంతో ఖైరతాబాద్ లోనూ తమదే గెలుపు అన్న ధీమాలో ఉంది. మరొకవైపు బీఆర్ఎస్ రెండుసార్లు వరసగా ఖైరతాబాద్ లో గెలిచింది. అభ్యర్థి దానం నాగేందర్ అయినా 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడంతో కారు పార్టీ గెలుపుపై ధీమా కనపరుస్తుంది. మరొకవైపు 2014లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి చింతల రామచంద్రారెడ్డి గెలవడంతో తాము కూడా రేసులో ఉన్నామని భావిస్తున్నారు. ఇలా మూడు పార్టీలూ ఎవరికి వారే ధీమాలో ఉన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం ఇంకా షెడ్యూల్ విడుదల చేయనందున మరియు ఎన్నికలు జరగనందున, గెలుపు ఎవరిదనేది ప్రస్తుతం చెప్పలేక పోయినా ఎడ్జ్ మాత్రం కాంగ్రెస్ కే ఉంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. . దానం నాగేందర్ అనర్హత వేటును సమర్థించడంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక మాత్రం అనివార్య మైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయ పార్టీల నేతలు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు తమ పార్టీ వైపే మొగ్గు చూపుతారని పేర్కొన్నారు సుప్రీంకోర్టు తీర్పు తర్వాత దానం నాగేందర్ స్పందిస్తూ, ఖైరతాబాద్ తనకు వ్యక్తిగతంగా బలమైన ప్రాంతమని, రాబోయే ఎన్నికల్లోనూ గెలుపు తనదేనని విశ్వాసం వ్యక్తం చేశారు. . ఈ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కూడా ప్రత్యేక వ్యూహాలతో సన్నాహాలు ప్రారంభిస్తున్నాయి. మరి చివరకు ఖైరతాబాద్ ప్రజలు ఎటువైపు నిలుస్తారన్నది చూడాలి. ఎన్నికల షెడ్యూల్ వెలువడి, అభ్యర్థులు ఖరారైన తర్వాతే అసలైన పోటీ మరియు గెలుపు సమీకరణాలు స్పష్టమవుతాయి.

కొత్త పొలిటికల్ పార్టీకి స్పేస్ ఉందా?



విజయవాడ, ా : ఆంధ్రప్రదేశ్ రాజకియాల్లో ఏళ్ల తరబడి కీలక సూత్రధారిగా, వైసీపీకి ఆయువువట్టలా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పార్టీ పెట్టేందుకు రెడీ అయ్యారు. తాను సీఎంని అవుతా అంటే ఇంకా తేడాగా ఉంటుందని .. జెన్ జీని సీఎంను చేస్తానని వింత మాటలు చెబుతూ ప్రెస్మీట్ పెట్టారు. ఆయన తీరు చూసిన వారికి ఎవరికైనా రాజకీయ ఉత్సాహం గానీ, దూకుడు గానీ కనిపించడం లేదని అనిపిస్తుంది తీవ్రమైన అలసట, ముఖంలో నీరసం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో ఒత్తిడితో ఆయన రాజకీయ ప్రకటన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.విజయసాయిరెడ్డికి ఉన్న ఏకైక బలం ఆర్థిక వనరులు. రాజకీయాల్లో డబ్బు ఉంటే సరిపోదు, దానిని నమ్మివచ్చే నాయకులు, కేడర్ ఉండాలి అనేది ప్రాథమిక సూత్రం. విజయసాయిరెడ్డి వద్ద వనరులకు లోటు లేకపోయినా, కేవలం ఆయన పెట్టే ఖర్చులను చూసి , డిజిటల్ మీడియా ఫండింగ్‌ను ఆశించి వచ్చే అనుచరులు మాత్రమే ఆయన చుట్టూ చేరే అవకాశం ఉంది. ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న రాజకీయ నేతలెవరూ తమ భవిష్యత్తును ఆయన కొత్త పార్టీకి తాకట్టు పెట్టే సాహసం చేయరు. నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులు కాకుండా, కేవలం నిధులు గుంజుకునే అవకాశం కోసమే వచ్చే ద్వితీయ శ్రేణి నేతలు, తాత్కాలిక అవకాశవాదులతో పార్టీ నడపడం ద్వారా ఆయనకు రాజకీయంగా ఒరిగేదేమీ ఉండదు. చివరికి మిగిలేది కేవలం ఖర్చు మాత్రమే.ఈ కొత్త ప్రయోగం వెనుక ఆయన అసలు కారణం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. వైసీపీని వీడిన నాటి నుంచి జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ, జగన్ పక్కన తనకు దక్కాల్సిన ప్రాధాన్యత , స్థానం మళ్లీ లభిస్తుందనే ఆశ ఆయనలో లోలోపల ఉందనే సంకేతాలు పదే పదే కనిపిస్తున్నాయి. నేరుగా వైఎస్సార్‌సీపీలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో, బయట ఒక మూడో ప్రత్యామ్నాయంగా లేదా ఒక రాజకీయ శక్తిగా తన ఉనికిని చాటుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను గుర్తించేలా చేయాలనే ఒక బార్గేనింగ్ స్ట్రాటజీ కూడా ఇందులో దాగి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.మరోవైపు, పాత కేసుల నుంచి రక్షణ, రాజకీయ రంగంలో కొనసాగుతున్నామనే ఒక కవచాన్ని కాపాడుకోవడం లేదా ఇతర కేంద్ర పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గడమూ ఈ కొత్త పార్టీ వెనుక కారణాలు కావచ్చు. అయితే, సొంతంగా ప్రజాకర్షణ లేని వ్యూహకర్తలు పార్టీలు పెట్టి జనం ముందుకు వెళ్లినప్పుడు ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ పరాభవాలు చరిత్రలో చాలానే ఉన్నాయి. సాయిరెడ్డి వంటి సీనియర్ ఆడిటర్, వ్యూహకర్తకు ఈ విషయం తెలియంది కాదు. అయినప్పటికీ, ఆశయం కంటే ఒత్తిళ్లు, వ్యూహాల కంటే ఖర్చులే ఎక్కువగా ఉన్న ఈ కొత్త రాజకీయ ప్రయాణంలో విజయసాయిరెడ్డికి లభించే రాజకీయ మైలేజ్ అతిస్వల్పమే. పార్టీ నిర్మాణం, డిజిటల్ మీడియా నిర్వహణ పేరిట కోట్లాది రూపాయల ఖర్చు మినహా.. క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు ఏమీ ఏర్పడదు.

జాతీయ రాజకీయాల్లో జగన్ దారెటు?



హైదరాబాద్, : కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం, సవరణ చట్టంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియాలో చేసిన ప్రకటన జాతీయ స్థాయిలో పెద్ద దుమారాన్నే రేపింది. పరీక్ష రాసే విద్యార్థే ఎగ్జామినర్‌ను నియమించుకున్నట్లుగా ప్రభుత్వమే సీఈసీని ఎంచుకోవడం ఏంటి " అని జగన్ లేవనెత్తిన ప్రశ్న సహేతుకమైనదే అయినప్పటికీ, దానికి ఆయన ఎంచుకున్న సమయం, గతంలో ఆయన పార్టీ తీసుకున్న పార్లమెంటరీ నిర్ణయాలు ఆయన రాజకీయ విధానాలను ప్రశ్నించేలా చేస్తున్నాయి. నిన్నటివరకు కేంద్ర చట్టాలకు సభలో మద్దతు పలికి, ఇప్పుడు విమర్శలకు దిగడంపై జాతీయ విపక్షాలు జగన్ మోహన్ రెడ్డిని ద్వంద్వ నీతి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలకు కారణం అవుతున్నాయి. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రాసోషల్ మీడియా వేదికగా జగన్‌కు నేరుగానే ఘాటు కౌంటర్ ఇచ్చారు. వ్యవస్థలను ధ్వంసం చేసే వారికి ముందు పార్లమెం ట్‌లో మద్దతు ఇవ్వడం ఆపండి.. ఆ తర్వాత గ్యాలరీ సమాధానాల కోసం మాట్లాడండి అంటూ ఆమె నేరుగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి ని తప్పిస్తూ కేంద్రం తీసుకువచ్చిన బిల్లుకు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతు పలికిన విషయాన్ని, కనీసం వాకౌట్ కూడా చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జాతీయ నేతలు గుర్తు చేస్తున్నారు. వైఎస్ జగన్ రాజకీయ విధానంలో అనుసరిస్తున్న అంశాల వారీ మద్దతు వ్యూహమే ఆయనను డిఫెన్స్‌లో పడేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలోని బీజేపీకి దాదాపు ప్రతి కీలక బిల్లు ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్, ఢిల్లీ సర్వీసెస్ బిల్లు, ఈసీ నియామక బిల్లు ముందస్తుగా మద్దతు పలికి, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక అవే నిర్ణయాలను తప్పుపట్టడం వల్ల ఆయన రాజకీయ విశ్వసనీయత దెబ్బతింటోంది. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి బీజేపీ విధానాలను మొదటి నుంచీ సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తుంటే, జగన్ మాత్రం సొంత రాష్ట్రాభివృద్ధి లేదా ఇతర సమీకరణాల పేరుతో కేంద్రానికి సహకరించారు. అయితే ఇప్పుడు ఏపీలో అధికారం కోల్పోయిన తర్వాత, ఎన్నికల కమిషన్ తీరుపై సొంతంగా అనుమానాలు వచ్చినప్పుడు మాత్రమే గళం విప్పడం వల్ల, జాతీయ విపక్షాలు ఆయనను సులభమైన రాజకీయ అవకాశవాది గా చూసే పరిస్థితి ఏర్పడింది. ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం లేదా పొలిటికల్ ఐడియాలజీ లేకపోవడం వల్లనే ఆయన తీరుపై ఇలాంటి విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ స్థాయిలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ వంటివి జగన్ వైఖరిని ఎండగడు తున్నాయి. ముందు పాలసీ ప్రకారం రాజకీయాలు చేయండి.. బీజేపీ తెచ్చే ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లులను పార్లమెంట్‌లో ఓడించకుండా మద్దతు ఇచ్చి, తీరా నష్టంజరిగిన తర్వాత రోడ్డెక్కి మాట్లాడటం వల్ల ఉపయోగం లేదు అని ఆయా పార్టీలు హెచ్చరిస్తున్నాయి. కేంద్రంతో వైఎస్సార్‌సీపీకి ఉన్న లోపాయికారీ అవగాహన వల్లే వారు ఇలా సగం దూరంలో ఆగిపోతున్నారనే ప్రచారంవ్యాపిస్తోంది. ఈ పరిణామాలు జగన్ మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు , జాతీయ ఇమేజ్‌కు పెద్ద పరీక్షగా మారాయి. మారుతున్న రాజకీయాల్లో మధ్యస్థ వైఖరి, అవకాశవాద మద్దతు పనిచేయదని, ఏదో ఒక వైపు స్పష్టమైన స్టాండ్ తీసుకోవాల్సిందేనని ఈ వివాదం స్పష్టం చేస్తోంది. మరి ఇప్పటికైనా జగన్ తన జాతీయ రాజకీయ విధానంపై స్పష్టత తెచ్చుకుంటారో లేదా ఇలాగే డబుల్ గేమ్ విమర్శలను ఎదుర్కొంటూ సాగుతారో వేచి చూడాలి.

ఏపీలో వడివడిగా మెట్రో అడుగులు

విజయవాడ, : దేశంలోని చాలా నగరాలల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో సేవలు కలిగిన రాష్ట్రాల జాబితాలోకి త్వరలో ఏపీ కూడా చేరబోతోంది. ఇతర రాష్ట్రాల్లో కేవలం ఒక ఒకటి, అరా నగరాల్లోనే మెట్రో సేవలు కొనసాగుతుంటే.. ఏపీలో ఏకంగా రెండు నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు ఏపీలోని విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లకు కేంద్రం ఆమోద ముద్ర పడే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక మదింపును కేంద్రం ప్రారంభించింది. అంటే?ఈ ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టేనని చెప్పవచ్చు. తెలుగు నేల విభజన తర్వాత విభజిత ఏపీలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన టీడీపీ? 2015లోనే విజయవాడతో పాటుగా విశాఖలో మెట్రో సేవల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలపై నాడు ఓ మోస్తరు అడుగులు పడినా? 2019లో టీడీపీ ఓడిపోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ప్రాజెక్టులు కాస్తా అటకెక్కేశాయి. అయితే 2024 ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసిన టీడీపీ? తిరిగి అధికారం చేజిక్కించుకుంది. అంతేకాకుండా అటు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు, ఇటు ఏపీలో టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు కొలువు దీరడంతో? సీఎం నారా చంద్రబాబునాయుడు మరోమారు మెట్రో ప్రాజుక్టుల బూజు దులిపారు.విజయవాడ, విశాఖల మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్ లను రూపొందించిన కూటమి సర్కారు.. వాటిని కేంద్రం పరిశీలనకు పంపింది. ఈ ప్రతిపాదనలపై దృష్టి సారించిన కేంద్రం? ఇటీవలే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక మదింపును ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే? ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోద ముద్ర పడనుంది. ఆ వెంటనే విజయవాడ, విశాఖల్లో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ కూడా ప్రారంభం కానుంది. వెరసి అతి త్వరలోనే ఈ రెండు నగరాల్లో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయన్న మాట. రెండు నగరాల్లో మొత్తంగా 84.63 కిలో మీటర్ల మేర మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి.ఇక విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు విషయానికి వస్తే..పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరు దారా తొలి దశ మెట్రో రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బందరు రోడ్డు, ఏలూ రోడ్డు, గన్నవరం, పెనమలూరుల్లో భూసేకరణకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. నగరంలో 38.40 కిలో మీటర్ల మేర ఏర్పాటు కానున్న మెట్రో ప్రాజెక్టుకు రూ.10,118 కోట్ల నిధులు అవసరం కానున్నాయి. బస్టాండ్ నుంచి గన్నవరం, పెనమలూరుల వరకు రెండు మార్గాల్లో మెట్రో ఏర్పాటు కానుంది. విశాఖ మెట్రో విషయానికి వస్తే? నగరంలో మూడు మార్గాల్లో 46.22 కిలో మీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు కానుంది.

మూడో ఉపఎన్నిక తప్పదా..?



హైదరాబాద్: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలలో తొలి వికెట్ కింద ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మీద అనర్హత వేటు పడింది. దీంతో దీని ఉప ఎన్నిక ఎప్పుడు ప్రకటిస్తారో అన్న ఉత్కంఠ నెలకొన్నది. నిబంధనల ప్రకారం ఖాళీ అయిన ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలి. ఈ లెక్కన 2027 మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఉప ఎన్నికలు జరగవచ్చని భావిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్పీకర్ ఖైరతాబాద్ సీటు ఖాళీ అయిందని ఎన్నికల సంఘానికి త్వరలో సమాచారం అందించనున్నారు. ఆ తర్వాత ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుందని తెలుస్తోంది! ఈ ఏడాది డిసెంబరులో గుజరాత్, వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుజరాత్ ఎన్నికలతో పాటు, లేదా మిగతా రాష్ట్రాల ఎన్నికలతో పాటు ఖైరతాబాద్ ఎన్నిక నిర్వహిస్తారని భావిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ విజయం సాధించారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించాడు. ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక రావడంతో ఎవరు గెలుస్తారు అన్న ఉత్కంఠ మొదలైంది. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఎన్నికలకు సిద్ధం అని అనర్హత వేటు పడిన దానం నాగేందర్ ప్రకటించారు. ఎన్నికలు నాకు కొత్త కాదు. ఖైరతాబాద్ నా కోట. ప్రజల మద్దతు ఉంది అని దానం అంటున్నారు. అనర్హత వేటు పడిన స్థానం, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడేళ్ల తర్వాత వస్తున్న ఎన్నిక కాబట్టి బీఆర్ఎస్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. 2028 ఎన్నికల్లో వచ్చేది తమ ప్రభుత్వమేనని అంటున్న బీజేపీ కూడా దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోది. ఉప ఎన్నికల షెడ్యూల్ వెలువడితే తప్ప అభ్యర్థులు ఎవరు అన్నది తేలుతుంది.

నోటీసులను లైట్ తీసుకుంటున్న రెస్టారెంట్లు..!



హైదరాబాద్, : హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో టీజీ సేఫ్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలు బయటపడ్డాయి. మొత్తం 20 సంస్థలను తనిఖీ చేయగా.. తీవ్రమైన లోపాలు గుర్తించిన 11 సంస్థల ఫుడ్ లైసెన్సులను సస్పెండ్ చేసి.. మూసేయాలని ఆదేశించారు. కొన్ని కిచెన్లలో ఎలుకలు, బొద్దింకలు, ఫంగస్ పట్టిన ఆహారం, గడువు ముగిసిన పదార్థాలు, అపరిశుభ్రమైన నిల్వ పరిస్థితులు గుర్తించారు. అయితే లైసెన్స్‌పై చర్యలు తీసుకున్నప్పటికీ కొన్ని హోటళ్లు ఇంకా ఓపెన్ చేసినట్లు అధికారులు గుర్తించారు.హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లోని 20 ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లలో టీజీ సేఫ్ ప్రత్యేక బృందాలు తనిఖీలు నిర్వహించాయి. కిచెన్‌లలో అపరిశుభ్రత, పురుగులు, ఎలుకల సంచారం, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, సరిగా నిల్వ చేయని ముడినరుకులు వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు.తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడినట్లు గుర్తించిన 11 హోటళ్ల ఫుడ్ లైసెన్సులను టీజీ సేఫ్ అధికారులు సస్పెండ్ చేశారు. తక్షణమే హోటళ్లలో కార్యకలాపాలు నిలిపివేసి.. మూసేయాలని ఆదేశించారు. మరో 6 హోటళ్లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు.. 3 రెస్టారెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో గుర్తించిన అనుమానాస్పద ఆహార పదార్థాల నుంచి శాంపిళ్లను సేకరించి పరీక్షలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. అయితే టీజీ సేఫ్ అధికారులు కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని రెస్టారెంట్ల నిర్వాహకులు వాటిని వట్టించుకోలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మరీ ముఖ్యంగా గచ్చిబౌలిలోని 'అంతేరా కిచెన్ అండ్ బార్'పై అధికారులు చర్యలు తీసుకున్న తర్వాత కూడా కార్యకలాపాలు కొనసాగినట్లు తెలుస్తోంది. లైసెన్స్‌పై చర్యలు తీసుకున్నప్పటికీ మరుసటి రోజు కూడా రెస్టారెంట్ తెరిచి ఉండటాన్ని టీజీ సేఫ్ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన సంస్థలకు కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించిన నేపథ్యంలో వాటిని అమలు చేయకపోతే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.ముఖ్యంగా ప్రజలు నేరుగా వినియోగించే ఆహారానికి సంబంధించిన అంశం కావడంతో అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ తనిఖీల్లో కొన్ని రెస్టారెంట్ల వంటగదుల్లో పరిస్థితులు అధికారులను విస్మయానికి గురిచేశాయి. హైటెక్ సిటీలోని 'మొనాస్టరీ'లో ఫంగస్ పట్టిన కూరగాయలు, కుళ్లిన గుడ్లు, సరైన లేబులింగ్ లేని ఉత్పత్తులను గుర్తించారు. గచ్చిబౌలిలోని 'శివాని ది రెస్టారెంట్ అండ్ బార్'లో మురికిగా ఉన్న కిచెన్ ఫ్లోర్‌తో పాటు పురుగులు పట్టిన ఆహార ధాన్యాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.అదే ప్రాంతంలోని 'అల్ సబా' రెస్టారెంట్‌లో కిచెన్ చిమ్నీలు జిడ్డుగా ఉండటం, సిబ్బంది గుట్కా నములుతూ పనిచేయడం, సిగరెట్ బట్స్ కనిపించడం వంటి లోపాలు గుర్తించారు. ఫ్రిజ్‌లలో ఉడికించిన ఆహారాన్ని, పచ్చి మాంసాన్ని కలిపి నిల్వ చేసినట్లు కూడా అధికారులు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని 'లక్కీ మల్టీకుసిన్', 'సాయి రామ్ మెస్'లో అపరిశుభ్రమైన ఫ్రిజ్‌లు, పురుగులు పట్టిన మైదా, మినప్పప్పు వంటి పదార్థాలను గుర్తించి అక్కడికక్కడే తొలగించారు.గచ్చిబౌలిలోని 'ఉడుపీస్ ఉపహార్'లో మురుగునీటి డ్రెయిన్లు బ్లాక్ కావడంతో దుర్వాసన వస్తున్నట్లు గుర్తించారు. అక్కడ ఎలుకల సంచారాన్ని కూడా అధికారులు గమనించారు. హైటెక్ సిటీలోని 'కోల్ స్పార్క్'లో ఫంగస్ పట్టిన 22 కిలోల వేరుశెనగలు, 25 కిలోల మిరియాలు, 8.9 కిలోల జీడిపప్పును స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.'కాంచీ కేఫ్'లో సీలింగ్‌పై సాలెగూళ్లు, పాడైన ముడిసరుకులు ఉన్నట్లు గుర్తించారు. ఇన్‌ఆర్బిట్ మాల్‌లోని 'అమ్ ఆహ్ తెలుగు కిచెన్'లో ఎలుకలు కొరికిన మయోనైజ్ ప్యాకెట్లు, ఆహార పదార్థాల్లో బొద్దింకలు ఉన్నట్లు తనిఖీల్లో బయటపడింది. అదే మాల్‌లోని 'ఫ్యూజన్ 9/ఆమ్నిషియా స్కై బార్'లో ఎలుకల విసర్జన ఆనవాళ్లు, ఫంగస్ పట్టిన క్యారెట్లను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.తీవ్రమైన ఉల్లంఘనలు కాకుండా సరిదిద్దాల్సిన లోపాలు ఉన్నట్లు గుర్తించిన ఆరు సంస్థలకు టీజీ సేఫ్ అధికారులు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేశారు. మాదాపూర్‌లోని రామేశ్వరం కేఫ్, గచ్చిబౌలిలోని ఇష్టా (విరుంత ఫుడ్స్), సాహిబ్స్ బార్బెక్యూ, పక్కా లోకల్, గచ్చిబౌలి హోటల్ షాదాబ్, షా ఘౌస్ రెస్టారెంట్లు ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సంస్థల్లో తీసుకున్న పారిశుధ్య చర్యలను పరిశీలించేందుకు రీ-ఇన్‌స్పెక్షన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిస్థితుల్లో మెరుగుదల లేకపోతే తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.టీజీ సేఫ్ స్పెషల్ టీమ్స్ నిర్వహించిన ఈ తనిఖీల్లో హోటల్ అవసా, మినర్వా గ్రాండ్, 63 డిగ్రీస్ మోడర్న్ రీజినల్ బఫే వంటి సంస్థలను కూడా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఆహార భద్రతా ప్రమాణాలు, వంటగది పరిశుభ్రత, ముడిసరుకుల నిల్వ, ఆహార పదార్థాల గడువు, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలను తనిఖీ చేశారు. సేకరించి ల్యాబ్‌లకు పంపించినట్లు అధికారులు వెల్లడించారు. వాటి పరీక్షల ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.రెస్టారెంట్లలో ఆహారం తీసుకునే ముందు పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ వంటి అంశాలను గమనించాలని నిపుణులు హితవు పలుకుతున్నారు. ఒకవైపు అధికారులు తనిఖీలు చేసి ఉల్లంఘనలను గుర్తిస్తున్న సమయంలోనే.. మరోవైపు వారి ఆదేశాలు జారీ చేసిన సంస్థలు తిరిగి కార్యకలాపాలు కొనసాగిస్తే ప్రజారోగ్య పరంగా ఆందోళన కలిగించే పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు. లైసెన్సులు సస్పెండ్ చేసిన తర్వాత కూడా నిబంధనలు ఉల్లంఘిస్తూ కార్యకలాపాలు కొనసాగించే సంస్థలపై సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయపడుతున్నారు.

ఇరుకురోడ్ల విస్తరణ పనులు షురూ...



హైదరాబాద్, : హైదరాబాద్ కేబీఆర్ పార్క్ చుట్టూ అమలు చేస్తున్న వన్‌వే ట్రాఫిక్ విధానం 15 రోజులు పూర్తయిన నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, రోడ్ నంబర్ 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్క్ మెయిన్‌గేట్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను గమనించారు. బాటిల్‌నెక్స్ తొలగించేందుకు రోడ్ల విస్తరణ, మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, యుటిలిటీల తరలింపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.బంజారా హిల్స్‌లోని కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానం అమలవుతున్న సంగతి తెలిసిందే. కొత్త అండర్‌పాసులు, బ్రిడ్జిల నేపథ్యంలో ఈ మార్గంలో వన్‌వే విధానం అమలు చేస్తున్నారు. అయితే వన్ వే తీరుతెన్నులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వన్ వే అమల్లోకి వచ్చి దాదాపు 15 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఇప్పటివరకు గమనించిన అంశాలు, ఆ మార్గంలోని వాహనదారుల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి వారు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, రోడ్ నం. 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్క్ మెయిన్‌గేట్ కూడళ్ల వద్ద ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు.ఆయా జంక్షన్ల వద్ద వెహికల్స్ ఆటంకం లేకుండా సాఫీగా ముందుకు సాగిపోయేలా చేపట్టాల్సిన దిద్దుబాటు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. వెహికల్స్ వేగం మందగిస్తున్న బాటిల్ నెక్ ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో రోడ్లను మరింతగా విస్తరించాలని నిర్ణయించారు. అవసరమైన చోట రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలను కూడా పరిష్కరించాలని అధికారులు నిర్ణయించారు. ముఖ్యంగా ఫిల్మ్‌నగర్ జంక్షన్ నుంచి రోడ్ నం. 45 జంక్షన్ మధ్య వెహికల్స్ రాకపోకలను సులభతరం చేసేందుకు ప్రాధాన్య క్రమంలో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. ప్రస్తుతం ఈ మార్గంలో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న ఎలక్ట్రిక్ స్తంభాలు, వాటర్ సప్లయ్ పైపులు, డ్రైనేజీ తదితర యుటిలిటీ లైన్లను యుద్ధప్రాతిపదికన ఇతర ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర సమగ్ర అభివృద్ధిలో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపడుతున్న హెచ్-సిటీ ప్రాజెక్టు ఫ్లై ఓవర్లు, అండర్ పాసుల నిర్మాణం కోసం అమలు చేస్తున్న ఈ వన్-వే విధానానికి వాహనదారులు సహకరిస్తున్నారని సజ్జనార్, కర్ణన్ పేర్కొన్నారు.

అధికారమే లక్ష్యంగా కమలం పావులు



హైదరాబాద్, : దక్షిణాదిలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేందుకు హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకున్నది. ఇందులో భాగంగా తెలంగాణ బీజేపీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ఐదుగురు ప్రముఖులతో కూడిన ప్రత్యేక నాయకత్వ కమాండ్ స్ట్రక్చర్‌ను తెరపైకి తెచ్చింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ప్రకటించిన ఈ సంస్థాగత మార్పులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి కలిగిస్తున్నాయి.అయిదుగురి కమాండ్ స్ట్రక్చర్‌లో రాజకీయ వ్యవహారాలు చూసేందుకు ముగ్గురు, సంస్థాగత బాధ్యతలు నిర్వర్తించేందుకు ఇద్దరు సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. రాజకీయ వ్యవహారాల వైపు నుంచి చూస్తే.. కర్ణాటకకు చెందిన ఎమ్మెల్యే అభయ్ పాటిల్, రేఖా శర్మలు కో-ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. ఇక తెలంగాణ ఇన్‌చార్జ్‌గా సునీల్ బన్సాల్ పైన పార్టీ అధిష్టానం మరోసారి నమ్మకం ఉంచి అదే స్థానంలో కొనసాగించింది.ఇక సంస్థాగత విభాగం బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించిన బీజేపీ హైకమాండ్, మధుకర్‌ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రాష్ట్ర ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీగా నియమించింది. ఖమ్మం ప్రాంతానికి చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త అయిన మధుకర్ కు మధ్యప్రదేశ్ బీజేపీ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీగా పనిచేసిన అనుభవం ఉంది. ఇకపై హైదరాబాద్ కేంద్రంగా తన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అలాగే రాష్ట్ర జాయింట్ జనరల్ సెక్రటరీగా దాశరథిని నియమించారు. ఆయన వరంగల్ కేంద్రంగా పనిచేయనున్నారు. జాతీయ జనరల్ సెక్రటరీ బి.ఎల్.సంతోష్ వర్గానికి చెందిన నేతలుగా వీరికి పార్టీలో బలమైన గుర్తింపు ఉంది.తెలంగాణలో ఇటీవలి పరిణామాలు, మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బీజేపీ ఈ సరికొత్త ప్రయోగానికి తెరలేపింది. ఒకవైపు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలని చూస్తున్న కాషాయ పార్టీకి, క్షేత్రస్థాయిలో అంతర్గత సమన్వయ లోపం పెద్ద సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో రాజకీయ వ్యవహారాలు, సంస్థాగత పటిష్టతను వేర్వేరుగా విభజించి వేర్వేరు కేంద్రాల నుంచి పర్యవేక్షించాలని హైకమాండ్ భావించింది.రెండు తెలుగు రాష్ట్రాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెడుతున్న బీజేపీ, రాబోయే ఎన్నికల నాటికి కేడర్‌లో జోష్ నింపేందుకు ఈ నాయకత్వ పునర్వ్యవస్థీకరణ దోహదపడుతుందని అంచనా వేస్తోంది. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న సమర్థులైన నేతలకు కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీలో క్రమశిక్షణను మరింత కఠినతరం చేయాలని చూస్తోంది. అయితే రాష్ట్ర నాయకత్వానికి, జాతీయ స్థాయి నుంచి నియమితులవుతున్న ఈ కమాండ్ స్ట్రక్చర్‌కు మధ్య సమన్వయం ఏ మేరకు కుదురుతుంది.. క్షేత్రస్థాయిలో ఇది పార్టీకి ఏ విధమైన ఫలితాలను ఇస్తుంది.. అనేది వేచి చూడాలి.

ఆసియా క్రీడలు: సెమీస్‌కు టీమిండియా

న్యూఢిల్లీ : ఆసియా క్రీడల్లో భారత్, ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య జరగాల్సిన రెండో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న టీమిండియా నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. కరోగి స్పోర్ట్స్ పార్క్‌లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో టాస్ కూడా వేయకుండానే మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారుఉదయం 5:30 గంటలకు జరగాల్సిన పాకిస్థాన్-హాంకాంగ్ తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ కూడా ఇదే కారణంతో రద్దయింది. ఆ మ్యాచ్‌లోనూ అధిక ర్యాంకింగ్ ఆధారంగా పాకిస్థాన్ సెమీస్‌కు చేరుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ 1 స్థానంలో ఉండగా.. ఆఫ్ఘనిస్థాన్ 10వ స్థానంలో ఉంది. మరోవైపు పాకిస్థాన్ 6వ ర్యాంకులో, హాంకాంగ్ 24వ ర్యాంకులో కొనసాగుతున్నాయి. ఈ నిబంధనల ప్రకారమే భారత్, పాక్ జట్లు ముందంజ వేశాయిసెమీఫైనల్లో శ్రీలంక, నేపాల్ మధ్య జరిగే మూడో క్వార్టర్ ఫైనల్ విజేతతో భారత్ తలపడుతుంది. మరో సెమీస్‌లో బంగ్లాదేశ్, మలేషియా మధ్య జరిగే నాలుగో క్వార్టర్ ఫైనల్ విజేతతో పాకిస్థాన్ పోటీ పడుతుంది.

మిగిలిన క్వార్టర్ ఫైనల్స్ మంగళవారం, సెమీఫైనల్స్ గురువారం జరగనున్నాయి. నిరాశ పరిచిన బ్యాడ్మింటన్ సియా క్రీడలు 2026లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రయాణం క్వార్టర్ ఫైనల్ దశలోనే ముగిసింది. ఆదివారం జరిగిన హోరాహోరీ పోరులో చైనా స్టార్ ప్లేయర్ చెన్ యుఫీ చేతిలో 21-11, 18-21, 10-21 తేడాతో సింధు పరాజయం పాలైంది. ఈ ఓటమి తర్వాత ఆమె ఎక్స్ వేదికగా తీవ్ర భావోద్వేగానికి లోనైంది. మ్యాచ్ ముగింపునకు కేవలం మూడు పాయింట్ల దూరంలో ఉన్న సమయంలో కీలక ర్యాలీలు చేజారడం తనను ఎంతగానో బాధిస్తోందని పేర్కొంది. 18 గంటల వ్యవధిలోనే వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడాల్సి రావడం తన శారీరక సామర్థ్యాన్ని దెబ్బతీసిందని సింధు వెల్లడించింది. "నా ఆసియా క్రీడల ప్రయాణం ముగిసింది, ఈ ఓటమి నన్ను ఎంతగానో బాధిస్తోంది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ముగించడానికి కేవలం మూడు పాయింట్ల దూరంలో ఉన్నప్పుడు చైనా షట్లర్‌తో జరిగిన సుదీర్ఘ ర్యాలీలే మ్యాచ్ గతిని మార్చేశాయి. నాకు అవకాశం వచ్చినప్పటికీ దాన్ని చేజార్చుకోవడం బాధాకరం" అని సింధు రాసుకొచ్చింది.నిర్వాహకులు నిర్ణయించిన షెడ్యూల్ ఎంత దారుణంగా ఉందో సింధు వివరించింది. "18 గంటల వ్యవధిలో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి వచ్చింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట వరకు మ్యాచ్ ఆడి, హోటల్‌కు చేరుకుని రికవరీ పనులు ముగించుకుని నిద్రపోయేసరికి తెల్లవారుజామున 3 గంటలు దాటింది. మళ్లీ ఉదయం 8:30 గంటలకే మేల్కొని క్వార్టర్ ఫైనల్ బరిలోకి దిగాల్సి వచ్చింది. ఈ పరిణామం నా ఫిట్‌నెస్‌పై తీవ్ర ప్రభావం చూపింది. అయినప్పటికీ నా పోరాట పటిమను పూర్తి స్థాయిలో ప్రదర్శించాను. చివరి క్షణాల్లో తప్పులను సరిదిద్దుకునేందుకు నా కోచింగ్ టీమ్‌తో కలిసి పనిచేస్తాను" అని తెలిపింది.మ్యాచ్ ప్రారంభంలో సింధు అద్భుతమైన ఫామ్‌తో కనిపించింది. అటాకింగ్ గేమ్‌తో చెన్ యు ఫీపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి తొలి గేమ్‌ను 21-11తో ఏకపక్షంగా గెలుచుకుంది. అయితే రెండో గేమ్‌లో చైనా ప్లేయర్ సుదీర్ఘ ర్యాలీలతో సింధును బాగా అలసిపోయేలా చేసింది. 18-21తో రెండో గేమ్‌ను కోల్పోయిన సింధు, నిర్ణయాత్మక మూడో గేమ్‌లో అలసట కారణంగా 10-21తో ఓటమిని మూటగట్టుకుంది. "ఒక చేదు ఫలితం దేశం కోసం 12 ఏళ్లుగా నేను సాగించిన ప్రయాణాన్ని తక్కువ చేయలేదు. 2014 నుంచి ఇప్పటివరకు నాలుగు ఆసియా క్రీడల్లో ఇండియా తరఫున శాయశక్తులా పోరాడాను" అని సింధు పేర్కొంది.బ్యాడ్మింటన్‌లో భారత పోరాటం ముగింపు.. షెడ్యూల్‌పై పెరిగిన అసంతృప్తి మరో క్వార్టర్ ఫైనల్లో యువ షట్లర్ ఉన్నతి హుడా సైతం జపాన్ క్రీడాకారిణి అకానె యమగుచి చేతిలో ఓడిపోవడంతో వ్యక్తిగత విభాగంలో భారత బ్యాడ్మింటన్ కథ ముగిసింది. పురుషుల టీమ్ ఈవెంట్‌లో దక్కిన కాంస్య పతకం మాత్రమే భారత్‌కు మిగిలింది. కాగా బ్యాడ్మింటన్ షెడ్యూల్ తీరుపై ఇప్పటికే ఇండోనేషియా స్టార్ జోనాథన్ క్రిస్టీ, జపాన్ షట్లర్ కొడై నరవోక, చైనా డబుల్స్ ప్లేయర్ టాన్ నింగ్ బహిరంగంగానే తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

అల్లు శిరీష్ వర్సెస్ బీజేపీ

హైదరాబాద్, : మొన్నటి వరకూ వినాయక నవరాత్రుల సందర్భంగా కొన్ని చోట్ల తీన్మార్ డప్పులు, డీజే శబ్దాలతో మోత మోగపోయింది. నవరాత్రి ఉత్సవాలు ముగిసినా కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకూ సందడి కంటిన్యూ అవుతోంది. కొందరు దేవుడి మండపాల దగ్గర విపరీతమైన సౌండ్స్‌తో డీజే బాక్సులు పెడుతున్నారు. కొద్ది రోజుల క్రితం ప్రముఖ నటి, పవన్ కల్యాణ్ మాజీ భార్య రేణూ దేశాయ్ రాత్రి పూట నిమజ్జనాలు ఎందుకు? అని ప్రశ్నించారు. తాజాగా, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడు, నటుడు అల్లు శిరీష్ కూడా డీజే శబ్దాలపై పోస్ట్ చేశారు. దీనిపై 'చీ' వేదికగా పోలీసులకు కంప్లైంట్ చేశారు. దీంతో కొందరు బీజేపీ కార్యకర్తలు, నెటిజన్స్ ఆయన్ను సోషల్ మీడియా వేదికగా ట్రోల్ చేస్తున్నారు. దీనిపైనా శిరీష్ రియాక్ట్ అయ్యారు.తాను షేక్ పేట్‌లోని అపర్ణా వన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నానని... గత కొన్ని రోజులుగా వినోభానగర్‌లోని హనుమాన్ ఆలయంలో అర్ధరాత్రి వరకూ పెద్ద శబ్దాలతో మ్యూజిక్ పెడుతున్నారని కంప్లైంట్ చేశారు. అర్ధరాత్రి 2 గంటల వరకూ ఇది ఉంటుందని.. గతంలో ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే గణేశ్ నిమజ్జనం వరకూ సహకరించాలని తనకు సూచించారని చెప్పారు.అయితే, నిమజ్జనం పూర్తైనా ఇది ఆగడం లేదని చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సిటీ పోలీసులకు ట్యాగ్ చేశారు. ఈ శబ్దాల వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు, ఉద్యోగులు చాలా ఇబ్బందికి గురవుతున్నట్లు చెప్పారు.ఈ ట్వీట్‌పై బీజేపీ కార్యకర్తలు, నెటిజన్స్ కొందరు శిరీష్‌ను ట్రోలింగ్ చేయడం స్టార్ట్ చేశారు. 'అల్లు శిరీష్ గారు... ఏడాదికి ఒకసారి గణేశ్ నవరాత్రుల వల్ల మీకు ఇబ్బంది కలుగుతుందని భావిస్తే అర్థం చేసుకోగలం. కానీ కోకాపేట చౌరస్తాలో ఉన్న మీ అల్లు థియేటర్ వల్ల మేము ప్రతీ రోజూ ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నాం. మీరు కూడా ఉదయం థియేటర్ నడిపించి సాయంత్రం వేళల్లో కొంత టైం మూసేస్తే బాగుంటుంది. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా అర్థం చేసుకుంటారని కోరుతున్నాం.' అంటూ ఓ బీజేపీ కార్యకర్త కౌంటర్ ఇచ్చాడు. దీనికి శిరీష్ సైతం రియాక్ట్ అయ్యాడు.ఫ్రెండ్స్... తనకు మతంపై విశ్వాసం ఉందని హనుమాన్‌ను పూజిస్తానని చెప్పారు అల్లు శిరీష్. 'అర్ధరాత్రి 2 గంటల వరకూ చెవులు పగిలేలా డీజే సౌండ్ పెట్టడం భక్తి అనిపించుకోదు. నేను కంప్లైంట్ చేసింది కేవలం సామాజిక స్పృహ లేకుండా వ్యవహరించడంపై మాత్రమే. భక్తి మీద కాదు. అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా. థాంక్స్' అంటూ రాసుకొచ్చారు. కొందరు నెటిజన్స్ ఆయనకు సపోర్ట్‌గా పోస్టులు పెడుతున్నారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో దిమ్మతిరిగే ఫలితం!

హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇఆ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని దేశమంతటా ఆరోపణలు వస్తున్నాయని, సీఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని ఆయన మండిపడ్డారు. బీఆర్కే భవన్‌లో మహేష్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేసే విధంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్నారని.. ఆయన రాజీనామా చేసే వరకు పోరాటం ఆగదన్నారు. అంతకుముందు సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని నెక్లెస్‌రోడ్డులో మహేష్ కుమార్ గౌడ

నెస్లే ఇండియాపై ఎఫ్ఎస్ఎస్ఎఐ మూడు కేసులు...

ఫుడ్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణల నేపథ్యంలో నెస్లే ఇండియాపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మూడు కేసులు నమోదు చేసింది. ఇన్ఫాంట్ న్యూట్రిషన్ ఉత్పత్తులకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రకటనలు, విక్రయాలను ప్రోత్సహించే ప్రచారంపై ఈ చర్యలు తీసుకున్నట్లు ఈఆాంఎ వెల్లడించింది. ఇన్ఫాంట్ ఫార్ములాకు సంబంధించిన ఫాలో-అప్ నమూనాలను కూడా అధికారులు పరీక్షించినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో బయోటిన్ మోతాదు నిర్దేశిత స్థాయికి తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు ఈఆాంఎ పేర్కొంది. శిశువుల పోషకాహారానికి సంబంధించిన ఉత్పత్తుల్లో పదార్థాల నాణ్యత, నిర్దేశిత ప్రమాణాలు పాటించడం అత్యంత ముఖ్యమని అధికారులు స్పష్టం చేశారు. పసిపిల్లల కోసం తయారు చేసే ఆహార ఉత్పత్తుల విషయంలో భద్రతా ప్రమాణాలను పాటించాల్సిన బాధ్యత తయారీ సంస్థలపై ఉంటుంది. ముఖ్యంగా ఇలాంటి ఉత్పత్తుల ప్రకటనలు, ప్రచారం, లేబులింగ్, విక్రయ విధానాలపై ప్రత్యేక నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఈ నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈఆాంఎ స్పష్టం చేసింది. ఫుడ్ సేఫ్టీ నిబంధనలకు సంబంధించిన ఉల్లంఘనలపై నెస్లే ఇండియాపై మొత్తం మూడు కేసులు నమోదు చేసినట్లు ఈఆాంఎ తెలిపింది. శిశువుల పోషకాహార విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ఉత్పత్తుల భద్రతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తారని పేర్కొంది. ఇన్ఫాంట్ ఫార్ములాకు సంబంధించిన ఫాలో-అప్ నమూనాలను కూడా అధికారులు పరీక్షించినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో బయోటిన్ మోతాదు నిర్దేశిత స్థాయికి తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు ఈఆాంఎ పేర్కొంది. ఈ కేసులకు సంబంధించి నెస్లే ఇండియా నుంచి వచ్చే వివరణ, తదుపరి చట్టపరమైన ప్రక్రియపై కూడా దృష్టి నెలకొంది.



సౌదీ అరామ్‌కో ముడిచమురు సరఫరా నిలిపివేత...



సౌదీ అరేబియాకు చెందిన చమురు దిగ్గజం సౌదీ అరామ్‌కో భారతీయ రిఫైనరీలకు ముడిచమురు సరఫరాను నిలిపివేసింది. సౌదీలోని కీలక ఈస్ట్ వెస్ట్ పైప్‌లైన్‌పై డ్రోన్ దాడి జరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

దీంతో ఇప్పటికే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, చమురు సరఫరా అంతరాల భయాలతో ఆందోళనలో ఉన్న భారతీయ రిఫైనరీలపై మరింత ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అరేబియా ద్వీపకల్పం గుండా సుమారు 1,200 కిలోమీటర్లు విస్తరించిన ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్‌ను ఇరాక్ నుంచి ఇరాన్ మద్దతు పొందుతున్న మిలీషియాలు డ్రోన్లతో లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. దీంతో గురువారం అధికారులు పైప్‌లైన్‌ను అత్యవసరంగా మూసివేశారు. రోజుకు 70 లక్షల బ్యారెళ్ల సామర్థ్యం ఉన్న ఈ పైప్‌లైన్‌ను హర్మూజ్ జలసంధి వద్ద నౌకా రాకపోకలకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో సౌదీ అరేబియా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో వినియోగిస్తోంది. యెమెన్ కేంద్రంగా పనిచేస్తున్న హౌతీ తిరుగుబాటుదారులు పశ్చిమ రెడ్ సీ తీర ప్రాంతంలోని ఇంధన, పౌర మౌలిక సదుపాయాలపై దాడులకు పాల్పడుతున్నారు. రెడ్ సీలో సౌదీ నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని హౌతీలు హెచ్చరించడంతో ఈ నెల ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి.

క్రూడాయిల్ సంక్షోభంలో పాక్ .. రాత్రి 9 గంటల తర్వాత షాపులు క్లోజ్..



అమెరికా, ఇరాన్ యుద్ధంతో ప్రపంచ దేశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. క్రూడ్ ఆయిల్ ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో పలు దేశాలు తలలు పట్టుకుంటున్నాయి. దాయాది దేశం పాక్ లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఇంధన ధరలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్ ప్రభుత్వం మరోసారి కఠినమైన పొదుపు చర్యలను చేపట్టింది. పెరుగుతున్న క్రూడ్ ధరలు, సరఫరా సమస్యల కారణంగా తీవ్ర ఒత్తిడిలో ఉన్న విద్యుత్, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు పాకిస్థాన్ క్యాబినెట్ డివిజన్ సెప్టెంబర్ 17న అధికారికంగా కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. పాకిస్థాన్ వ్యాప్తంగా మార్కెట్లు, షాపింగ్ మాల్స్ రాత్రి 9 గంటలకే మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అలాగే వెడ్డింగ్ హాల్స్, ఇతర ఈవెంట్ వేదికలు రాత్రి 10 గంటల కల్లా బంద్ చేయాలి స్పష్టం చేసింది.

ఇక రెస్టారెంట్లు, కేఫ్‌లు, ఫుడ్ అవుట్‌లెట్‌లు రాత్రి 11 గంటల వరకు మాత్రమే తెరిచి ఉండాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. అయితే పార్శిల్, హోమ్ డెలివరీ సేవలకు మాత్రం మినహాయింపు ఇచ్చినట్లు పాక్ అధికారులు తెలిపారు. పెళ్లిళ్లలో విందుకు కేవలం ఒక వంటకం మాత్రమే వడ్డించేలా పాక్ పరిమితి విధించింది. ప్రజలపైనే కాకుండా ప్రభుత్వ వ్యవస్థపైనా ఈ ఆంక్షల ప్రభావం తీవ్రంగా ఉండనుంది.

ప్రభుత్వ శాఖల అధికారిక వాహనాల ఇంధన కోటాను 3 నెలల పాటు ఏకంగా 50 శాతం మేర తగ్గించినట్లు పేర్కొన్నారు. ఫెడరల్ డిపార్ట్‌మెంట్లు కొత్త వెహికల్స్ కొనకుండా నిషేధం విధించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరికరాలు మినహా మిగిలిన డ్యూరబుల్ గూడ్స్ కొనుగోళ్లను బంద్ చేశారు.

అమెరికాను దెబ్బ కొట్టేలా చైనా దిమ్మతిరిగే వ్యూహం...



గడిచిన దశాబ్ద కాలంలో (2016 – 2026) ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు తమ అధికారిక మారక నిల్వల నిర్వహణలో విప్లవాత్మకమైన, పరస్పర భిన్నమైన వ్యూహాలను అమలు చేశాయి. అమెరికా డాలర్ ఆధారిత యూఎస్ ట్రెజరీ బాండ్లు, పసిడి నిల్వల కేటాయింపుల్లో చోటుచేసుకున్న ఈ బలమైన మార్పులు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ యొక్క భవిష్యత్తు దిశానిర్దేశాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా చైనా, భారత్, జపాన్, స్విట్జర్లాండ్,

యునైటెడ్ కింగ్‌డమ్ దేశాలు తమ నిల్వల సమతుల్యతను కాపాడుకోవడంలో పూర్తిగా వేర్వేరు మార్గాలను ఎంచుకున్నాయి.ల అంతర్జాతీయ మార్కెట్లో చైనా అనుసరించిన వైఖరి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. యూఎస్ ట్రెజరీ సెక్యూరిటీలపై ఆధారపడటాన్ని తగ్గించుకునే వ్యూహాత్మక ఆలోచనలో భాగంగా.. చైనా జూన్ 2016 నుండి జూన్ 2026 మధ్య కాలంలో తన ట్రెజరీ హోల్డింగ్స్‌ను 1.19 ట్రిలియన్ డాలర్ల నుండి ఏకంగా 47 శాతం తగ్గించి 633.4 బిలియన్ డాలర్లకు పరిమితం చేసింది. అదే సమయంలో.. తన భద్రతా నిల్వలను పటిష్టం చేసేందుకు బంగారు నిల్వలను 1,842.56 టన్నుల నుండి 27 శాతం పెంచి 2,346.43 టన్నులకు చేర్చింది. డాలర్ ఆధిపత్యం నుండి బయటపడి తమ ఆర్థిక వ్యవస్థను రక్షించుకోవడమే లక్ష్యంగా చైనా ఈ "డి-డాలరైజేషన్" వ్యూహాన్ని నిలకడగా అమలు చేస్తోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పెట్రోల్ పంపుల్లో రూ.2,000 దాటితే యుపిఐ బంద్.. క్యాష్ మాత్రమే



ఇంధన కొనుగోళ్లపై కొత్తగా ప్రతిపాదించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ భారాన్ని ఉపసంహరించుకోవాలని, లేదా పెట్రోల్ పంపులకు మినహాయిరు ఇవ్వాలని పెట్రోల్ డీలర్లు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ తమకు మినహాయింపు ఇవ్వకపోతే, రూ. 2,000 కంటే ఎక్కువ మొత్తంలో జరిగే యూపీఐ (జఖఎ) డిజిటల్ చెల్లింపులను నిలిపివేసి, కేవలం నగదు లావాదేవీలను మాత్రమే అనుమతిస్తామని వివిధ రాష్ట్రాల పెట్రోలియం డీలర్లు స్పష్టం చేశారు.

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సవరించిన యూపీఐ ఫ్రేమ్ వర్క్ ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి పెట్రోల్ పంపుల్లో రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన ఇంధనాన్ని కొనుగోలు చేసి యూపీఐ ద్వారా చెల్లిస్తే రూ. 5 ప్లాట్ ఓఆఖీ రుసుము వర్తిస్తుంది. అయితే రూ. 2,000 కంటే తక్కువ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీ ఉండదు. ఈ కొత్త నిబంధనపై ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా పెట్రోలియం ట్రేడర్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఢిల్లీ-ఎన్సీఆర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ముంబై, కర్ణాటక, రాజస్థాన్, జమ్ముకశ్మీర్ సహా పలు రాష్ట్రాలకు చెందిన డీలర్లు దీనిని వ్యతిరేకిస్తున్నారు.

పెట్రోల్ పంప్ నిర్వాహకులకు లీటరుకు రూ. 2.40 నుంచి రూ. 3.40 వరకు మాత్రమే కమిషన్ లభిస్తుందని, ఇంధన ధరల నిర్ణయం తమ చేతుల్లో ఉండదని వారు స్పష్టం చేశారు. ఇలాంటి సమయంలో ప్రతి లావాదేవీపై రూ. 5 చొప్పున పడితే తమ మార్జిన్‌పై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు, కమర్షియల్ వాహనాల యజమానులు ఎక్కువగా రూ. 2,000 కంటే ఎక్కువ మొత్తానికే ఇంధనం కోనుగోలు చేస్తుంటారు. అక్టోబర్ 15 నాటికి తమ డిమాండ్ నెరవేరకపోతే యూపీఐ సేవలు నిలిపివేస్తామని ముంబై సహా పలు ప్రాంతాల డీలర్లు పేర్కొనడంతో, వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ యుపిఐ రుసుము వ్యాపారులకు (మర్చంట్స్) వర్తించేది మాత్రమేనని, దీని భారాన్ని వినియోగదారులపై వేయకూడదని ప్రభుత్వం తేలిపింది. ఈ ఛార్జీలను కస్టమర్లపై వేయకుండా చూసేందుకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను సిద్ధం చేస్తోంది.

హైదరాబాద్‌లో 'న్యూ ఐడెంటిటీ' ఫ్లాగ్‌షిప్ స్టోర్ ప్రారంభం



ప్రముఖ దుస్తుల బ్రాండ్ మ్యాక్స్ ఫ్యాషన్ తన భారత ప్రస్థానంలో 20 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న వేళ, దేశంలోనే మొట్టమొదటి 'న్యూ ఐడెంటిటీ' ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను హైదరాబాద్‌లో వైభవంగా ప్రారంభించింది. కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్‌లో 13,000 చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ 39వ స్టోర్‌ను సినీ నటి మృణాల్ ఠాకూర్, మ్యాక్స్ ఫ్యాషన్ సీఈఓ సుమిత్ చంద్నాతో కలసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి కల్కి కోచ్లిన్ క్యూరేట్ చేసిన 'మ్యాక్స్ ప్రాజెక్ట్ న్యూ' ఫెస్టివ్ కలెక్షన్‌ను ఆవిష్కరించారు.

రాజస్థానీ సంగనేర్ బ్లాక్ ప్రింటింగ్ ప్రేరణతో, చెన్నైకి చెందిన దివ్యాంగ కళాకారుల కళాకృతులతో రూపొందించిన ఈ పండుగ కలెక్షన్ ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకుంది. కస్టమర్లు కేవలం షాపింగ్ చేయడమే కాకుండా ఒక కొత్త ఫ్యాషన్ అనుభూతిని పొందేలా ఈ స్టోర్‌ను అత్యంత ఆధునిక లేఅవుట్‌తో తీర్చిదిద్దారు. విశాలమైన నడక దారులు, సులభంగా కలెక్షన్లను అన్వేషించే వీలు మరియు పురుషులు, మహిళలు, పిల్లల కోసం దుస్తులు, పాదరక్షలు,

యాక్సెసరీస్ 'ఫ్యాషన్ ఫర్ ఆల్' కాన్సెప్ట్‌తో ఒకే చోట లభించేలా ఏర్పాటు చేశారు. ఇది కేవలం ఒక సాధారణ దుకాణంలా కాకుండా ఒక ప్రత్యేకమైన షాపింగ్ గమ్యస్థానంగా ఉందని మృణాల్ ఠాకూర్ ప్రశంసించారు.

ఫ్యాషన్ ప్రియుల మారుతున్న అభిరుచులకు అనుగుణంగా దేశవ్యాప్తంగా చేపడుతున్న 'న్యూ ఐడెంటిటీ' విస్తరణలో భాగమే ఈ హైటెక్ స్టోర్ అని కంపెనీ యాజమాన్యం వెల్లడించింది.

తొలి డెంగ్యూ టీకా వచ్చేస్తోంది..!

ఇందుకోసం జపాన్‌కు చెందిన టకెడా ఫార్మాస్యూటికల్ కంపెనీ? డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌తో శుక్రవారం ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా దేశంలోని ప్రైవేట్ మార్కెట్‌లో ఈ టీకాను డాక్టర్ రెడ్డీస్ దేశీయంగా పంపిణీ చేయనుంది. స్థానిక అధికారిక ప్రక్రియలు పూర్తైన తర్వాత 2027 ప్రథమార్ధంలో టీకా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఇరు సంస్థలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. క్యూడెంగ్యూ టీకాకు కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ(సీడీఎన్‌సీఓ) ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా రెడ్డీస్ గ్లోబల్ జనరిక్ సీఈవో ఎంవీ రమణ మాట్లాడుతూ.. దేశంలో రెండో అతిపెద్ద వ్యాక్సిన్, తొలి ఆమోదిత డెంగ్యూ వ్యాక్సిన్‌ను ప్రవేశపెట్టడం దేశీయ ఆరోగ్య సంరక్షణ రంగానికి ఒక కీలక పరిణామమన్నారు.

టకెడా ఫార్మాతో కుదుర్చుకున్న ఒప్పందంతో అర్హులైన వ్యక్తులకు క్యూడెంగ్యూను అందుబాటులోకి తీసుకురావడానికి, దేశంలో డెంగ్యూ భారాన్ని తగ్గించే ప్రయత్నాలకు తోడ్పాటునందించడానికి వీలు పడనున్నదన్నారు. టకెడా ఇంటర్నేషన్ బిజినెస్ హెడ్ మహేందర్ నాయక్ మాట్లాడుతూ..రెడ్డీతో

కుదుర్చుకున్న ఒప్పందంతో భారత్‌లో తమ తొలి డెంగ్యూ వ్యాక్సిన్‌ను విడుదల చేయడానికి లైన్‌క్లియర్ అయిందని, ఇప్పటికే 43 దేశాల్లో 32 మిలియన్ల డోస్‌లను డిస్ట్రిబ్యూట్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో చిన్నారులు, పెద్దలకు టీకాను అందించేందుకు ఏర్పాట్ల చేస్తున్నారు.



ఇలా అయితే అనారోగ్యం వచ్చినట్టే



వేసవి కాలం వచ్చిందంటే చాలు అందరికీ ముందుగా గుర్తొచ్చేది పండ్ల రాజు మామిడి పండు. ఆ రుచికి, సువాసనకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అయితే మామిడి పండ్లను ఆస్వాదించే క్రమంలో మనం చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చాలామంది మామిడి పండు తిన్న వెంటనే దాహంగా అనిపించి నీళ్లు తాగుతుంటారు. ఇది చూడటానికి సాధారణ విషయంగా అనిపించినప్పటికీ, శరీరంలోని జీర్ణవ్యవస్థను ఇది తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం రుచి కోసం పండును ఆస్వాదించడమే కాదు, దానిని ఎలా తినాలో కూడా తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మామిడి పండ్లలో చక్కెర శాతం, పీచు పదార్థం అంటే ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మన శరీరంలో జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. మనం పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల పొట్టలోని జీర్ణరసాలు పలుచబడిపోతాయి. దీనివల్ల మామిడి పండులోని పోషకాలను శరీరం గ్రహించే వేగం మందగిస్తుంది. ఫలితంగా జీర్ణ ప్రక్రియ ఆలస్యమై ఆహారం పొట్టలో అలాగే ఉండిపోయి గ్యాస్ లేదా అసౌకర్యానికి దారితీస్తుంది. అందుకే మామిడి పండు తిన్న తర్వాత కనీసం అరగంట పాటు నీటిని ముట్టుకోకపోవడమే శ్రేయస్కరం. మామిడి పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రధాన ఇబ్బందుల్లో కడుపు నొప్పి ఇంకా విరేచనాలు ముఖ్యమైనవి. నీరు జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును అడ్డుకోవడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాక పొట్టలో గందరగోళం మొదలవుతుంది. ఇది వికారం లేదా కడుపులో ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. మామిడి పండులోని ఫ్రక్టోజ్ (సహజ చక్కెర) నీటితో కలిసినప్పుడు బ్యాక్టీరియా చర్య వేగవంతమై ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం కూడా ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే మామిడి పండు తిన్న తర్వాత కనీసం ముప్పై నుండి నలభై నిమిషాల వరకు వేచి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో జీర్ణక్రియ సక్రమంగా జరిగి పండులోని విటమిన్లు ఇంకా ఖనిజాలు రక్తంలో కలుస్తాయి. ఆ తర్వాత నీళ్లు తాగడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలాగే మామిడి పండ్లను రాత్రి పూట కంటే ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల అవి మెరుగ్గా జీర్ణమవుతాయి. పండు తినే ముందు దానిని గంట పాటు నీటిలో నానబెట్టడం వల్ల అందులోని వేడి తగ్గి చర్మానికి ఎటువంటి అలర్జీలు రాకుండా ఉంటాయి.

రాత్రి భోజనంలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది..?

నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. చాలా కుటుంబాల్లో చపాతీ, అన్నం లేకుండా భోజనం సంపూర్ణం కాదు. చపాతీ, అన్నం తినేంత వరకు అది భోజనంలా అనిపించదు. కొందరు చపాతీని ఆరోగ్యకరమైనదిగా భావిస్తే, మరికొందరు అన్నం తేలికైనదని, సులభంగా జీర్ణమవుతుందని అనుకుంటారు. ఈ రెండు ఆహారాలలో ఏది సులభంగా జీర్ణమవుతుంది? దేనికి ఎక్కువ సమయం పడుతుంది అనే ప్రశ్న చాలా మందిలో తలెత్తుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి తక్కువ సమయం పడుతుంది. కానీ చపాతీ తినడం కూడా మంచిదే.

1 నుండి 2 గంటల సమయం పడుతుంది. అన్నంలో అధిక మొత్తంలో పీచుపదార్థం ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అన్నం శరీరంలోకి ప్రవేశించినప్పుడు త్వరగా గ్లూకోజ్‌గా మారుతుంది. అందుకే అనారోగ్యంతో లేదా బలహీనంగా ఉన్నవారికి తరచుగా అన్నం తినమని సలహా ఇస్తారు.

ఇది కడుపును తేలికగా ఉంచి, తక్షణ శక్తిని అందిస్తుంది. తెల్ల బియ్యంకంటే బ్రౌన్ రైస్‌లో ఫైబ ర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. జీర్ణక్రియకు తెల్ల



బియ్యం కంటే బ్రౌన్ రైస్ మంచిది. మరింత ప్రయోజనకరమైనది. కాబట్టి రాత్రి పూట చపాతీ బదులు బ్రౌన్ రైస్ తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. చపాతీ పగటి వేళల్లో తీసుకుంటే మంచిది.

వెయిట్‌లాస్‌కు మ్యాజిక్ ఫార్ములా...?



అతిగా వ్యాయామం చేయకుండానే బరువును అదుపులో ఉంచుకునే అద్భుత ఫార్ములా '30-30-30'. ఉదయం నిద్రలేచిన అరగంటలో ప్రోటీన్ తీసుకోవడం, ఆపై 30 నిమిషాల వ్యాయామంతో జీవక్రియను వేగవంతం చేసే ఈ సింపుల్ టెక్నిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. నేటి ఆధునిక జీవనశైలిలో అధిక బరువు అనేది చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య. బరువు తగ్గాలనే ఆత్రుతతో చాలా మంది క్రాష్ డైట్లు పాటించడం, అతిగా వ్యాయామాలు చేయడం లేదా సర్జరీల వైపు మొగ్గు చూపడం వంటివి చేస్తుంటారు. అయితే ఇటువంటి పద్ధతులు శరీరానికి మేలు చేయడం కంటే అనారోగ్య సమస్యలనే ఎక్కువగా తెచ్చిపెడతాయి. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ అని గుర్తించాలి. దీని కోసం ఎటువంటి ఇబ్బంది లేకుండా, ఆరోగ్యకరమైన పద్ధతిలో పనిచేసే '30-30-30' రూల్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది.

ఇది సరళంగా ఉన్నప్పటికీ జీవక్రియపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది. ఈ నియమం ప్రకారం.. ఉదయం నిద్రలేచిన 30 నిమిషాల లోపు 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలి.

పదే పదే బీపీ పెరుగుతోందా.. ఇలా జరిగితే ప్రాణం ప్రమాదంలో ఉన్నట్లే!



ఈ మధ్య కాలంలో చాలా మంద అధిక రక్తపోటు భారిన పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఈ సమస్య తలెత్తుతుంది. అయితే అసలు బీపీ ఎంత ఉంటే నార్మల్, ఎంత దాటింది అంటే మీ ప్రాణం రిస్క్‌లో ఉన్నట్లో ఇప్పుడు తెలుసుకోండి. అధిక రక్తపోటు కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఒత్తిడి, డిప్రెషన్, అతిగా ఆలోచించడం వలన కొంత మందిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అయితే ఒక వ్యక్తికి 120/80ఎఎఊణ ఉంటే అది సాధారణం. కానీ దీనికి మించి ఉంటే అది అధిక రక్తపోటు సమస్యగా గుర్తించి, తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే కొన్ని సార్లు ఇది అకస్మాత్తుగా 200 దాటే ఛాన్స్ ఉంటుంది. అయితే ఇలా దాటింది అంటే అది తీవ్రమైన అనారోగ్య సమస్యగా గుర్తించాలి. ముఖ్యంగా ఇది మీ శరీరంలో అనేక అవయవాలపై ప్రభావం చూపుతుంది. కొన్ని సార్లు అత్యవసర పరిస్థితిగా కూడా పరిగణించవచ్చు, ఇలానే కొనసాగితే ఇది మరణానికి కూడా దారితీస్తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అధిక రక్తపోటు అనేది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపుతుంది. కొన్ని సార్లు పక్షవాతానికి కూడా దారితీస్తుందంట. అంతే కాకుండా ఇలా పదే పదే బీపీ పెరిగి, మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి, పక్షవాతం వస్తుంది.

ఇండస్ట్రీలో ఆ అంశాలకే
ఎక్కువ ప్రాధాన్యత



'మీర్జాపూర్' వెబ్ సిరీస్‌లో 'బీనా త్రిపాఠి' పాత్రతో దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్, పాపులారిటీ సంపాదించుకున్న టాలెంటెడ్ నటి రసిక దుగల్. ఆ తర్వాత పలు వైవిధ్యమైన చిత్రాలు, సిరీస్‌లలో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొని సినిమా పరిశ్రమకు సంబంధించి కొన్ని షాకింగ్ విషయాలు బయటపెట్టింది. ఇండస్ట్రీలో కెరీర్ పరంగా తాను ఎదుర్కొన్న అనుభవాలను, వాస్తవాలను ఆమె పంచుకున్నారు. జీవితంలో, అలాగే సినిమా రంగంలో కొన్నిసార్లు నటుడి ప్రతిభ కంటే వ్యాపారపరమైన కోణాలకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని రసిక దుగల్ అభిప్రాయపడ్డారు.

శ్రీనిధి శెట్టి ఇంట్రెస్టింగ్ పోస్ట్...



విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శకుటుంబం'. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ప్రైవల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ మూవీ అక్టోబర్ 2న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఇందులో భాగంగా అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన చిత్ర బృందం ఇప్పటికే విడుదల చేసిన అప్డేట్స్‌తో సినిమాపై హై బజ్ క్రియేట్ అయింది. అదే జోష్‌తో రీసెంట్‌గా టీజర్ రిలీజ్ చెయ్యగా నెట్టింట సూపర్ రెస్పాన్స్ సొంతం చేసుకుంది.

సూపర్ స్టార్‌కు ఉన్న అంకితభావం
నాకు ఎంతో స్ఫూర్తినిస్తుంది



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూనే,స్టార్ హీరోల చిత్రాలలో కీలక పాత్రలతో అలరిస్తున్నారు. మరో వైపు విజయ్‌సేతుపతి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'బత్తా'. బాలాజీ తరణీతరణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అల్లీ సమర్పణలో ముర‌ద్ ఖేతాని, ప్రియా అల్లీ, అలోక్ జైన్, అజిత్ అంధారే నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా, మేకర్స్ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పాల్గొన్న విజయ్ సేతుపతి సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో తన అనుభవాలను పంచుకుంటూ ఆసక్తికర విషయాలు చెప్పారు. రజినీకాంత్ గారిని తాను ఎప్పుడూ ఎంతో గౌరవిస్తానని, ఆయనపై తనకు ఎంతో ఆరాధనా భావం ఉందని విజయ్ తెలిపారు. ఆ సమయంలో దర్శకుడు నెల్సన్ అక్కడికి వచ్చి తమలపాకులు, వక్కలు, లవంగాలను ఉంచి.. అవసరమైతే వాటిని వాడుకోవాలని చెప్పారు.

అప్పుడే పురుషులకు ఆ బాధ తెలుస్తుంది..



కోలీవుడ్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. విజయ్ సేతుపతితో కలిసి 'ట్రెయిన్', దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాలలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఓ వైపు నటిగా రాణిస్తూనే.. సింగర్‌గా కూడా పలు చిత్రాల్లో పాటలు పాడుతున్నారు. దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'లోనూ ఆమె ఒక పాటకు తన మధురమైన స్వరాన్ని అందించారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ శృతి హాసన్ పలు ఇంటర్వ్యూలో పాల్గొంటున్నారు.తాజాగా, సోహా అలీ ఖాన్ నిర్వహించిన ఒక ప్రత్యేక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శృతి హాసన్.. పీరియడ్స్ సమయంలో వచ్చే తీవ్రమైన నొప్పులు, వాటి గురించి సమాజంలో ఉండే అపోహలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీసిండ్రోమ్) సమస్య ఉందని, దీని కారణంగా పీరియడ్స్ సమయంలోతాను చాలా బాధను అనుభవిస్తానని తెలిపారు. తన సినీకెరీర్ ఆరంభంలో ఈ విషయాల గురించి మాట్లాడేందుకు తానుకొంచెం మొహమాటపడేదానినని,దీని గురించి ఎవరూ పెద్దగా చర్చించ రనిభావించానని శృతి చెప్పారు. కానీ తోటి నటులు తమ మోకాలి సర్జరీవంటిసమస్యల గురించి చెప్పినప్పుడు డైరెక్టర్లు సెట్స్‌లో సర్దుబాటు చేసేవారని, తాను మాత్రం పీరియడ్స్ గురించి చెప్పడానికి సంకోచించేదానినని తెలిపారు. మగవాళ్లకు కూడా పీరియడ్స్‌వస్తే బాగుంటుందని, అప్పుడు ఆటోమేటిక్‌గా వర్క్ కాం ట్రాక్ట్స్‌లో పీరియడ్ సెలవులు కూడావచ్చి ఉండేవి కదా అని తాను అనుకున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా పురుషులకు కూడా నెలసరి రావాలని అప్పుడే మహిళలు పడే బాధ వాళ్లకు తెలుస్తుంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com